Postel No. MBN/08/2016-2018




# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :249 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు గురువారం 01 జనవరి 2026 పేజీలు :12 వేల రూ5 /-

## కొత్త ఏడాదిగా ఘన స్వాగతం




**న్యూఢిల్లీ, డిసెంబర్ 31:** 2026కి స్వాగతం పలికిన పసిఫిక్ దేశాలుప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్యాలెండర్ మారుతున్న వేళ.. కిరిబాటి దీవుల తర్వాత న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరం 2026కు ఘన స్వాగతం పలికింది. అక్కడి స్థానిక సమయం ప్రకారం గడియారం ముల్లు 12 దాటగానే.. ఆక్లాండ్ నడిబొడ్డున ఉన్న న్యూజిలాండ్ ఎత్తైన కట్టడం 'స్కై టవర్' - మిగతా3లో

# కేడర్ లో జోష్ నింపిన కేసీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 31:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ రాజకీయ క్షేత్రంలో తనదైన శైలిలో గర్జించారు. తెలంగాణ రాజకీయాల్లో మునుపటి జోష్‌ను నింపుతూ పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడిన తీరు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండానే, అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, ముఖ్యంగా ప్రజల ప్రాణధారమైన కృష్ణా జలాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఈ వ్యవహారంలో రెండు ప్రభుత్వాలు 'దొంగాట' ఆడుతున్నాయని, తెలంగాణ



హక్కులను తాకట్టు పెడుతున్నాయని ఆయన మండిపడ్డారు.పాలనాపరమైన వైఫల్యాలపై కేసీఆర్ చేసిన విమర్శలు గంభీరంగా ఉండటమే కాకుండా, తెలంగాణ అస్తిత్వానికి సంబంధించిన అంశాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎక్కడా ఉచ్చరించకుండానే, కేసీఆర్ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల రైతులకు, సాధారణ ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ఆయన సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.తన పదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ ఆయన చేసిన విమర్శలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. గతంలో కంటే మరింత స్పష్టతతో, పదునైన మాటలతో కేసీఆర్ రంగంలోకి దిగడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త - మిగతా3లో

## అజారుద్దీన్
# పదవికి గండం

**హైదరాబాద్, డిసెంబర్ 31:**నూహ్యంగా మంత్రి అయ్యారు. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వేళ..ముస్లిం ఈక్వేషన్ ఆయనకు అమాత్య యోగాన్ని తెచ్చి పెట్టింది. నిజానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి గ్రేటర్ కోటాలో మంత్రి కావాలనుకున్నారు అజారుద్దీన్. అయితే ఎంఐఎం అబ్జక్షన్స్‌తో అజార్‌ను జూబ్లీహిల్స్ సీటు రేస్ నుంచి తప్పించారు కాంగ్రెస్ పెద్దలు. సరిగ్గా ఉపఎన్నిక జరుగుతున్న టైమ్‌లోనే ఆయన్ను హడావుడిగా మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. అయితే ఏ సభకు ఎన్నిక కాకుండానే మంత్రి అయిన..అజార్ ఆరు నెలల్లోపు ఏదో ఒక సభకు ఎన్నిక కావాల్సి ఉంది.అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచనలోనే మంత్రివర్గంలోకి తీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం



నామినేట్ చేసింది. వీరి నియామకాన్ని - మిగతా3లో

# గజగజ వణికిస్తున్న చలి

**అదిలాబాద్, డిసెంబర్ 31**:తెలంగాణను గడ్డకట్టే చలి వణికిస్తోంది. మూడు వారాలుగా కొనసాగుతున్న తీవ్ర చలితో జనజీవనం స్తంభించింది. ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. హైదరాబాద్‌లోనూ చలి తీవ్రత పెరిగింది. మేఘాలు లేకపోవడం, హిమాలయాల నుంచి చల్లని గాలులు రావడమే దీనికి కారణాలని నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ అయ్యాయి.తెలంగాణ రాష్ట్రాన్ని గడ్డకట్టే చలి వణికిస్తోంది. గత మూడు వారాలుగా తీవ్రమైన చలిగాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. వరుసగా 24వ రోజు కూడా చలి తీవ్రత ఏమాత్రం తగ్గకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు గజగజలాడుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం



పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ ఆయా ప్రాంతాలకు - మిగతా3లో

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
# నిధులు విడుదల

డిసెంబర్ మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆర్థిక శాఖ ద్వారా బుధవారం 713 కోట్ల రూపాయల బిల్లులు విడుదల అయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం 713 కోట్ల రూపాయలు విడుదల చేసింది. డిసెంబర్ మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారు.



ఈ నేపథ్యంలోనే ఆర్థిక శాఖ ద్వారా బుధవారం 713 కోట్ల రూపాయల బిల్లులు విడుదల అయ్యాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జూన్ నెలాఖరులో183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆగస్టు నుంచి ప్రతినెల కనీసం 700 కోట్ల రూపాయల చొప్పున విడుదల చేస్తోంది. విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్స్‌లు ఉన్నాయి.

## అసెంబ్లీలో రేవంత్‌ను ఎదుర్కొనేందుకు
# హరీష్‌కు పవర్స్



**హైదరాబాద్:** అసెంబ్లీలో బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా హరీష్ రావును నియమిస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఉభయ సభల్లో పార్టీ గళాన్ని బలంగా వినిపించేందుకు అనుభవజ్ఞులైన నేతలకు బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేతలుగా బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాల ద్వారా అటు అసెంబ్లీలో, ఇటు మండలిలో అధికార పక్షాన్ని ధీటుగా ఎదుర్కోవాలని కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లయింది.శాసనసభలో హరీష్ రావుతో పాటు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ లకు కూడా డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా నియమించారు. సభా వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉన్న హరీష్ రావుతో - మిగతా3లో

## 152 కేసులు...
## 223 మంది ఉద్యోగులు

**హైదరాబాద్, డిసెంబర్ 31:**తెలంగాణలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో) ఈ ఏడాది సరికొత్త రికార్డులు నమోదు చేసింది. కరప్షన్ కేసుల నమోదులో గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరుగుదల కనిపించింది. అవినీతి అధికారులను వెంటాడుతూ ఏసీబీ చర్యలు చెప్పటి ది . ఈ ఏడాది ఇప్పటివరకు తెలంగాణ ఏసీబీ 220కు పైగా కేసులను నమోదు చేసింది. ఈ కేసుల్లో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేయడం విశేషం. ముఖ్యంగా అధిక శాతం కేసులు ట్రాప్ కేసులే కావడం గమనార్హం. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అధికారుల సంఖ్య ఈ ఏడాది మరింత పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏసీబీ నమోదు చేసిన కేసుల సంఖ్య దాదాపు 100 వరకు ఎక్కువగా ఉంది. గత సంవత్సరం మొత్తం 152 కేసులు నమోదు కాగా, వాటిలో 223 మంది ఉద్యోగులను అరెస్ట్ చేశారు. అయితే ఈ ఏడాది కేసుల సంఖ్య మాత్రమే కాకుండా, దాడుల తీవ్రత కూడా పెరిగినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.అత్యధికంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు ఏసీబీ వలలో చిక్కడం విశేషం. కీలక శాఖల్లో పనిచేస్తున్న అధికారులు లంచాలకు అలవాటు పడటంపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది.




మీకు మీ కుటుంబ సభ్యులకు,
పాఠకులకు శ్రేయోభిలాషులకు,
ప్రకటనకర్తలకు ,
**నూతన సంవత్సర శుభాకాంక్షలు**
వార్త తరంగాలు
పత్రిక యాజమాన్యం



# సంపాదకీయం

## ప్రజాస్వామ్యం పరిఢవిల్లేనా?

ప్రజాస్వామ్య సౌధం నాలుగు స్తంభాలపై నిలిచి ఉంది. చట్టసభలు, కార్యనిర్వాహక శాఖ, న్యాయ వ్యవస, మీడియా. ఈ నాలుగు స్తంభాలలో ముఖ్యమైన చట్టసభలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరపవలసిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వాలదే. ముఖ్యంగా లోక్‌సభ శాసనసభలకు ఐదేళ్లకొకసారి లేదా కాస్త ముందుగా గాని ఎన్నికలు నిర్వహిస్తుండగా మిగిలిన స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారు. ఐదేళ్లు నిండిన తర్వాత వీటికి ప్రత్యేక అధికారులు నియమించి పాలన సాగిస్తున్నారే కానీ ఏదో ఒక కుంటిసాకుతో వాటికి ఎన్నికలు జరపడం లేదు. ఫలితంగా వాటికి రావలసిన కేంద్ర నిధులు విడుదల కాక అభివృద్ధి పడకేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. ఏదో విధంగా అబద్ధపు ప్రచారాల తోనూ, అలవికాని హామీలతోనూ ఓటర్లను ఆకర్షించవచ్చు. తమ ఓటు షేర్ పెంచుకునే ప్రయత్నం చేయవచ్చు. అధికార పక్షం బలప్రదర్శనకు, అంతో ఇంతో అధికార దుర్వినియోగానికి మంచి అవకాశం. కాగా ప్రతిపక్షాలకు విమర్శల బాణాలు సంధించడానికి, అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే దానికి సువర్ణ అవకాశం. పోటీ చేసే అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి ఫలితాల ప్రకటన వరకు గొప్ప టెన్షన్. తెగించి ఖర్చు చేస్తున్నా అందుకు అనుకూలమైన ఫలితం వస్తుందో లేదో అన్న ఆందోళన వారిని ఆవహించి ఉంటుంది. ఎన్నికల కమిషన్ కంటపడకుండా ఖర్చు చేయాలి. అందరినీ 'సంతృప్తి' పరచుకుంటూ పోవడం అతడికి అత్యవసరం. ఈ మహా ప్రక్రియలో చివరి బకరా ఓటరు. ఆశించి భంగపడటం అతడి నైజం. అందుకే ఈ మధ్య అభివృద్ధి జరుగుతుందని, తమ జీవితాలు బాగుపడతాయని సగటు ఓటరు విశ్వసించడం లేదు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఇచ్చే సొమ్మునే ఆశిస్తున్నాడు, దానికి ఆశపడుతున్నాడు. మన వ్యవస్థలో ఎన్నికల అక్రమాలు, నిబంధనల అతిక్రమణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. పోటీ అభ్యర్థులను బెదిరించడం, లొంగదీసుకునే ప్రయత్నం చేయడం, కొంతమంది అభ్యర్థులతో లోపాయకారి ఒప్పందాలు నేటి ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యాయి. ముఖ్యంగా ఎన్నికల ముందు రోజు జరిగే అక్రమాలకు, దుర్మార్గాలకు అంతులేకుండాపోయింది. పోలింగ్‌నాడు కూడా ఓటరుకు తన ఓటు తాను వేసేంతవరకు నమ్మకం లేదు. అంటే ప్రతిచోట ఎన్నికల ప్రక్రియ అపహాస్యం అవుతుండగా ప్రజాస్వామ్యంపై విశ్వాసం సన్నగిల్లుతున్నది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారుతున్నది. జాతీయ స్థాయిలో కార్పొరేట్లు తమకు అనుకూలమైన ప్రభుత్వాల కోసం వందల వేల కోట్లు పార్టీలకు విరాళాలు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. గతంలో పెద్ద పదవులకు అంటే ఎంపి, ఎంఎల్ఏ లాంటి వాటికి విదేశాలలో ఉన్న వారు సైతం దేశానికి వచ్చి ఏదో ఒక పార్టీ టికెట్ సంపాదించి పోటీ చేయడం పదవులు అనుభవించడం మనకు అనుభవమే. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థులు విదేశాల నుండి 'దిగుమతి' అవుతున్నారు. కొంతమంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి లేదా పదవి విరమణ చేసి మరీ ఈ సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేశారు. అంటే వారికి 'సేవా తత్పరత' ఎక్కువవుతున్నది. మాతృభూమిని అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నట్లు వారు చెప్పుకోవడం సంతోషమే. కానీ అది ఐదేళ్ల తర్వాత ఆ గ్రామ ప్రజలు ఇవ్వవలసిన తీర్పు మాత్రమే. మన దగ్గర మహిళా అభ్యర్థులు పదవులకు ఎంపికైనా కానీ వారి 'మగమహారాజు'లే పరిపాలిస్తుంటారు. అనధికార పరిపాలకులుగా చలామణి అవుతుంటారు. పదవులు మహిళలకు, అధికారాలు వారి భర్తలకు. కొన్ని సందర్భాలలో సమావేశాలకు సైతం వారి భర్తలే హాజరై చర్చల్లో పాల్గొంటూ నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరించడం శోచనీయం. మాటల్లోని మహిళాభ్యున్నతి గడప దాటడం లేదు. తరతరాలుగా జీర్ణించుకొని పోయిన పురుషాధిక్యం సమాజంలో మహిళలకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పరచుతూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. కొన్నిచోట్ల దళిత గిరిజన సర్పంచులపై ఆ గ్రామంలోని ఆధిపత్య కులాలు తమ పెత్తనం చెలాయిస్తుండటం చూస్తూనే ఉన్నాం. కొంతమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు తమ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఇతర నియోజకవర్గాలను చిన్నచూపు చూస్తారు లేదా నిర్లక్ష్యం చేస్తారు. వీరు రాష్ట్రం మొత్తానికి లేదా దేశం మొత్తానికి బాధ్యులు అనే విషయం మరవడం బాధాకరం. పదవి స్వీకారం నాడు ఏ వ్యక్తికి, ప్రాంతానికి అనుచితంగా లేదా పక్షపాతంతో వ్యవహరించబోమని దైవసాక్షిగా ప్రమాణం చేస్తారు. ప్రజలు ప్రశ్నించడం మానుకున్నారు. ప్రశ్నించిన వాడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్నది. అందుకే అవినీతికి అంతులేకుండా పోతున్నది. న్యాయం అందడానికి, పొందడానికి కాలము, డబ్బు ఖర్చవుతున్నాయి. సామాన్యుడి సహనానికి పరీక్షగా మారింది. రాజకీయాలలో డబ్బు జోక్యం ఎక్కువైంది. అందుకే గతంలో లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, మేధావులు, సంఘ సంస్కర్తలు రాజకీయాలు నడపగా నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మద్యం వ్యాపారులు, నేరచరితులు రాజకీయాలను ఆక్రమించారు, విలువలను పాతరేశారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా రాజకీయాల పట్ల ఆకర్షితులవుతున్నారే కానీ వాటిని ప్రక్షాళన చేయలేకపోతున్నారు. అందులో విజయం సాధించలేకపోతున్నారు. రేపటి తరానికి దిశానిర్దేశం చేయలేకపోతున్నారు. రాజకీయ నాయకులకు, ఉద్యోగులకు లాగా ఒక నిర్దిష్టమైన అర్హత లేకపోవడం ఈ వ్యవస్థ దురదృష్టం. ఓటుకు ఈసారి గిరాకీ మరీ పెరిగింది. దూరతీరాలలో ఉన్న వారు సైతం తమ సొంత ఊరుకొచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అభ్యర్థుల ఖర్చుతో. ఒక పెద్ద మనిషి ప్రత్యేకించి విదేశాల నుండి విమానంలో విచ్చేసి తన హక్కును కాపాడుకొని ఓటు విలువ తెలియజేశాడు. నిన్నమొన్నటి ఎన్నికలలో ఒకచోట ఒక ఓటు విలువ 40 వేలు పలికినట్లుగా చదివాం. కొన్ని చోట్ల కోట్లు చేతులు మారుతున్నట్టుగా చదువుతున్నాం. అంతో ఇంతో ఈ దేశంలో ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టిన టిఎన్ శేషన్ సదాస్మరణీయుడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశంలో జిల్లాకు ఒక శేషన్ కూడా సరిపోడేమో! ఆ పిల్లిమెడలో గంటకట్టేది ఎవరో? ఆశగా ఎదురు చూద్దాం. ఇక గ్రామాల్లో శాంతి నెలకొంటుందని, అవి అభివృద్ధి పథంలో సాగుతాయని కోరుకుందాం.

### ఆన్‌లైన్‌లో అభ్యంతరకరమైన

# కంటెంట్‌పై కొరడా...

**న్యూఢిల్లీ, డిసెంబర్ 31:**ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలకు కేంద్రం మరోసారి తీవ్ర హెచ్చరికలు చేసింది. తమ వేధికల్లోని అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై సరైన చర్యలు తీసుకోకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వాటికి వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు డిసెంబరు 29న ఐటీ శాఖ సర్క్యూలర్ జారీ చేసింది. ఇందులో ఐటీ నిబంధనలు 2021 ప్రకారం, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని, ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్య తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలకు కేంద్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. తమ వేదికలపై అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై సరైన చర్యలు తీసుకోకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. డిసెంబర్ 29న కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ జారీచేసిన ఉత్తర్వులో ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలు తమ అంతర్గత నిబంధనలను వెంటనే సమీక్షించుకోవాలని, చట్టవిరుద్ధమైన, అశ్లీల కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇక, సుప్రీంకోర్టు కూడా ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికల్లో ప్రసారమయ్యే కంటెంట్‌ను పోర్నోగ్రఫీతో పోల్చింది.ఈ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు



తప్పవని మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఆన్‌లైన్ వేదికలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం సెక్షన్ 79 కింద లభించే బాధ్యత మినహాయింపు, తమ ప్లాట్‌ఫామ్‌లలోని మూడో పక్షం కంటెంట్‌పై 'తగిన జాగ్రత్త' తీసుకున్నప్పుడే వర్తిస్తుందని పేర్కొంది. ఇటీవలి సమీక్షలో అనేక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అశ్లీల, అసభ్యకరమైన, ఇతర చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఐటీ నిబంధనలు 2021 ప్రకారం.. అశ్లీల, పిల్లల లైంగిక వేధింపులకు సంబంధించిన లేదా పిల్లలకు హానికరమైన కంటెంట్‌ను అందుబాటులో ఉంచడం, అప్‌లోడ్ చేయడం, ప్రచురించడం, ప్రసారం చేయడం, పంచుకోవడం వంటివి నిరోధించడానికి సహేతుకమైన ప్రయత్నాలు చేయాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు మంత్రిత్వ శాఖ గుర్తు చేసింది.కోర్టు ఆదేశాలు లేదా ప్రభుత్వ నోటిఫికేషన్ అందిన వెంటనే చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని లేదా దానికి యాక్సెస్‌ను నిలిపివేయాలని స్పష్టం చేసింది. లైంగిక చర్యలలో ఒక వ్యక్తిని చిత్రీకరించే కంటెంట్‌పై ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్య తీసుకోవడం తప్పనిసరి. అన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్ మోడరేషన్ సిస్టమ్‌లను, అంతర్గత నియంత్రణ ప్రక్రియలను, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను వెంటనే సమీక్షించుకోవాలని ఐటీ మంత్రిత్వ శాఖ కోరింది. ఇదిలా ఉండగా, ఆన్‌లైన్, సోషల్ మీడియాలో అశ్లీలత శృతిమించడంతో సామాజిక ఉద్యమకారులు, హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో సుప్రీంకోర్టు సైతం అనేక సందర్భాల్లో ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని నియంత్రణకు మార్గదర్శకాలను రూపొదించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# ఢిల్లీకి కవచం.. సుదర్శన చక్రం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 31:**దేశ రాజధాని ఢిల్లీలో భద్రతకు సంబంధించి కేంద్రంలోని మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.5,181 కోట్లతో స్వదేశీ సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ ను కొనుగోలు చేయడానికి అనుమతించినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఈ మేరకు జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 'సుదర్శన చక్ర' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద ఢిల్లీలోని ముఖ్యమైన వీఐపీ-89 జోన్‌లో ఈ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నారు డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ దేశ రాజధాని చుట్టూ 30 కి.మీ. పరిధిలోని గగనతలంలో ఎటువంటి ముప్పునైనా నిరోధించగలదని సదరు వర్గాలు తెలిపాయి. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల వంటి ఆయుధాల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో మోదీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధాలను కొనుగోలుచేయడానికి రక్షణ శాఖ సోమవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఈ గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారంప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది ఆగస్టు 15 ప్రసంగంలో గగనతల రక్షణ వ్యవస్థ గురించి ప్రకటించారు. 'సుదర్శన్ చక్ర' పేరుతో కీలక ప్రాంతాలను వైమానిక దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచం, ప్రతిదాడి వ్యవస్థలను మోహరించనున్నట్లు తెలిపారు. దేశంలోని వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల భద్రతే దీని లక్ష్యం. ఇందులో భాగంగా శత్రువులు ప్రయోగించే క్షిపణులు, యుద్ధ విమానాలను ముందుగానే గుర్తించి, కూల్చివేసే వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే, సైబర్ దాడులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ఈ వ్యవస్థలో అనుసంధానిస్తారు.డీఆర్డీవో, సైన్యం, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయడానికి కేంద్రం ఇప్పటికే సన్నాహకాలు ప్రారంభించింది. ఢిల్లీలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత గగనతల భద్రతను పటిష్టం చేయాలని భారత్ నిర్ణయించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులకు దాయాది రగిలిపోయింది. సరిహద్దుల్లోని భారత సైనిక, వైమానిక స్థావరాలపై దాడులకు ప్రయత్నించగా.. వాటిని సైన్యం సమర్ధవంతంగా అడ్డుకుంది. ఎస్-400 వంటి గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ వినియోగించింది. అంతేకాదు, పాక్‌పై ఎదురుదాడి చేసి, దాని మౌలిక వసతులు, సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. పాక్ నూర్ ఖాన్ ఎయిర్ బేస్ సహా కీలకమైన వ్యవస్థలను ధ్వంసం చేసింది

### రాజకీయ వ్యూహాలు....

# కుటుంబ బంధాలు !

మహారాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపు చోటుచేసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉన్న అన్నదమ్ములు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే మళ్లీ ఒక్కటయ్యారు. ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా 2026 ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వీరిద్దరూ కలిసి పనిచేయాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ముంబైలోని శివాజీ పార్క్ సమీపంలో ఉన్న శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే స్మారక చిహ్నం వద్ద ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఒకే కారులో రాజ్ థాకరే ఇంటి నుంచి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది కేవలం ఒక కుటుంబ సమావేశం మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.విభేదాలు, వ్యక్తిగత అపార్థాల కారణంగా విడిపోయిన ఈ కుటుంబం మళ్లీ కలవడం మరాఠీ ఓటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రత్యేకంగా ఏక్‌నాథ్ షిండే వర్గంతో తీవ్రంగా పోరాడుతున్న ఉద్ధవ్ థాకరేకు, తమ్ముడు రాజ్ థాకరే మద్దతు లభించడం ఒక పెద్ద ప్లస్ పాయింట్‌గా కనిపిస్తోంది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉద్ధవ్ థాకరే రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఎందుకంటే ఈ ఎన్నికల్లో గెలుపు సాధిస్తేనే శివసేన అసలైన వారసుడు ఎవరు అన్న విషయం ప్రజల్లో స్పష్టతకు వస్తుంది.మరాఠీ మనుషుల హక్కుల కోసం, ముంబై ఆత్మగౌరవం కోసం తామంతా ఒక్కటయ్యామని ఈ ఇద్దరు నాయకులు ప్రకటించారు. కులమతాలకు అతీతంగా ముంబై ప్రజలందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని శివసేన నాయకులు పేర్కొన్నారు. విడిపోయి పోరాడితే అది ఇక్కడి అమరవీరులకు చేసే అవమానమని కూడా వారు స్పష్టం చేశారు.రాజ్ థాకరే తన ప్రసంగంలో ఐక్యతను బలంగా చాటారు. వ్యక్తిగత అపార్థాల కన్నా మహారాష్ట్ర గౌరవమే ముఖ్యమని అన్నారు. సీట్ల పంచకాలు కన్నా ముంబై ప్రయోజనాలే తమకు ప్రాధాన్యత అని, నాసిక్ వంటి ఇతర కార్పొరేషన్లలో కూడా ఈ పొత్తు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ పొత్తు ద్వారా ముంబై పీఠాన్ని తప్పకుండా దక్కించుకుంటామని రాజ్ థాకరే ధీమా వ్యక్తం చేశారు.అయితే ఈ రాజకీయ పొత్తు ద్వారా నిజంగా లాభం ఎవరికీ? నష్టం ఎవరికీ? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ కలయిక వల్ల లాభం నేరుగా ముంబై ప్రజలకు చేరుతుందా? లేక ఈ ఇద్దరు సోదరులకు, వారిని నమ్ముకున్న



నాయకులకు మాత్రమే పరిమితమవుతుందా? అన్న సందేహాలు ఉన్నాయి.మరోవైపు, ఈ పొత్తు వల్ల షిండే వర్గానికి, అలాగే మహారాష్ట్రలోని ఇతర రాజకీయ పార్టీలకు ఇది పెద్ద సవాల్‌గా మారనుంది. మరాఠీ ఓటు బ్యాంక్ మళ్లీ ఒకే చోట చేరితే, రాబోయే ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, థాకరే బ్రదర్స్ కలయిక కేవలం ఒక కుటుంబ పునర్మిళనం మాత్రమే కాదు. ఇది మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మలుపు. దీని ఫలితం ముంబై మున్సిపల్ ఎన్నికలతో పాటు, రాష్ట్ర రాజకీయాల దిశను కూడా నిర్ణయించనుంది. ఈ పొత్తు ద్వారా ఎవరు గెలుస్తారు, ఎవరు నష్టపోతారు అన్నది కాలమే తేల్చాలి. కానీ ఇప్పటికైతే, ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా కొనసాగుతోంది.2023లో ఎన్సీపీ చీలిక తర్వాత ఉప్పు-నిప్పులా విడిపోయిన బాబాయ్-అబ్బాయ్ (శరద్ పవార్, అజిత్ పవార్) మళ్లీ చేతులు కలిపారు. రాబోయే పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం రెండు వర్గాలు కలిసి పోటీ చేస్తాయని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. "రాష్ట్ర అభివృద్ధి కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గడియారం, ట్రంపెట్ గుర్తులు ఇప్పుడు ఏకమయ్యాయి. పవార్ కుటుంబం మళ్లీ ఒక్కటైంది" అని ఆయన పేర్కొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.పింప్రి-చించ్వాడ్ ప్రాంతం దశాబ్దాలుగా పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 1999 నుంచి 2017 వరకు ఇక్కడ పవార్ల హవానే నడిచింది. అయితే 2017లో బీజేపీ ఈ కోటను కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ పాత వైభవాన్ని తిరిగి తెచ్చుకోవడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పొత్తుకు సిద్ధం అయ్యాయి. కేవలం కుటుంబం కలవడమే కాకుండా.. ఓట్లు చీలిపోకుండా చూసి బీజేపీని దెబ్బకొట్టాలనేది వీరి మాస్టర్ ప్లాన్. సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇప్పటికే ముగిశాయని.. త్వరలోనే తుది జాబితా విడుదల చేస్తామని అజిత్ పవార్ స్పష్టం చేశారు.ఈ పొత్తుపై మహాయుతి కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. బీజేపీ నేత నవనీత్ రాణా మాట్లాడుతూ.. "అజిత్ పవార్ ఎప్పుడూ శరద్ పవార్ మాట వింటారని మాకు తెలుసు. ఇప్పుడు వారు కలవడం సంతోషకరం. త్వరలోనే శరద్ పవార్ కూడా ఎన్డీయేలో చేరుతారని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అయితే ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం మాత్రం దీనిని తీవ్రంగా విమర్శించింది. మహారాష్ట్ర ప్రజలు కేవలం 'ఇంటి పేరు' చూసి ఓట్లు వేయరని.. అభివృద్ధి చేసే వారికే పట్టం కడతారని షైనా ఎన్‌సి వంటి నేతలు ఎద్దేవా చేశారు.ముంబై, పుణెతో పాటు పింప్రి-చించ్వాడ్ సహా మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు 2026 జనవరి 15వ తేదీన పోలింగ్ జరగనుంది. మరుసటి రోజు అంటే జనవరి 16వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు. నామినేషన్ల దాఖలుకు డిసెంబర్ 30 చివరి తేదీ కావడంతో.. పవార్ల పొత్తు ప్రకటన అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పుణె రీజియన్‌లో పట్టు సాధించేందుకు 'పవార్ పరివార్' వేసిన ఈ ఎత్తుగడ ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

# అజారుద్దీన్ పదవికి గండం

- మొదటి పేజీ తరువాయి

సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.గత ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయలేదు. అయితే గత అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్ ఏప్రిల్ 30లోపు ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యేగా ఎన్నిక కావాల్సి ఉంది.తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అయ్యే పరిస్థితి లేదు. వచ్చే ఏడాది నవంబర్‌లో మూడు ఎమ్మెల్సీలు ఖాళీ కానున్నాయి. కానీ అజారుద్దీన్ మంత్రిగా కొనసాగాలంటే అప్పటివరకు ఆగే పరిస్థితి లేదు. ఒకవేళ ఎమ్మెల్సీ కవిత రాజీనామాను స్పీకర్ ఆమోదించినా అది నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు ఆ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం లేదంటున్నారు. దీంతో అజారుద్దీన్ మంత్రి



పదవి..సుప్రీంకోర్టు తుది తీర్పుపైనే ఆధారపడి ఉందని అంటున్నారు. సుప్రీంకోర్టు ఫైనల్ డెసిషన్ వచ్చే వరకు అజారుద్దీన్, కోదండరాం ఎదురు చూడటం తప్ప మరో మార్గం లేదని లీగల్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.ఏప్రిల్ 30 వరకు అజారుద్దీన్ ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. లేకపోతే ఆయన మంత్రి పదవి ఊస్ట్ అయ్యే అవకాశముంది. దీంతో ఈ సమస్యను ఎలా అధిగమించాలనే దానిపై కాంగ్రెస్ నేతలు లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చిస్తున్నారట. ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో అప్పీల్ చేసైనా సరే ఎమ్మెల్సీల నియామకంపై సందిగ్ధతకు చెక్ పెట్టాలని భావిస్తున్నారట. లేకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి ఆరు నెలల ముచ్చటగానే మిగిలిపోనుంది.గతంలో నందమూరి హరికృష్ణ కూడా సేమ్ టు సేమ్ ఇలాంటి సిచ్యువేషనే ఎదుర్కొన్నారు. అప్పట్లో హరికృష్ణ కూడా ఏ సభలో సభ్యుడు కాకపోవడంతో మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఇక ఆయన రాజకీయాలకే దూరం కావాల్సి వచ్చింది. మళ్లీ చట్టసభలో ఎన్నడూ అడుగుపెట్టలేకపోయారు. ఇప్పుడు అజారుద్దీన్‌కు కూడా అలాంటి పరిస్థితి ఏర్పడిందంటున్నారు.ఒకవేళ ఏప్రిల్ 30లోపు సుప్రీంకోర్టు ఫైనల్ తీర్పు ఇవ్వకపోతే..అజారుద్దీన్‌తో రాజీనామా చేయించి మళ్లీ క్యాబినెట్‌లోకి తీసుకుంటారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఎలాగూ క్యాబినెట్ ప్రక్షాళన చేయాలనే ఆలోచన ఉండటంతో..అజార్‌ను రిజైన్ చేయించి..మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకుంటే..ఇంకో ఆరు నెలల టైమ్ ఉంటుందని భావిస్తున్నారట. అప్పటిలోగా సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వడమో లేక..నవంబర్‌లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ సీట్లలో ఒక బెర్త్ కట్టబెట్టమో రెండింటిలో ఏదో ఒక ఆప్షన్ ఉంటుందనేది హస్తం పార్టీ పెద్దల ఆలోచన అంటున్నారు. ఏదైనా అజారుద్దీన్‌కు..హస్తం పార్టీకి పెద్ద కష్టమే వచ్చిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# కేడర్ లో జోష్ నింపిన కేసీఆర్

- మొదటి పేజీ తరువాయి

ఉత్సాహం కనిపిస్తోంది. కేసీఆర్ పునరాగమనం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తుందన్న సంకేతాలను ఈ సమావేశం బలంగా ఇచ్చింది.

**జనవరి 2 నుంచి అసెంబ్లీకి...**

14 ఏళ్ల పోరాటం. పదేళ్ల అధికారం. రెండేళ్ల ప్రతిపక్ష పాత్ర. ఒకే ఒక్కడు. ఆయనే కేసీఆర్. నాడు ఉద్యమ నాయకుడిగా అయినా..తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా..ఆయన ఫాంహౌస్‌లో ఉన్నా వార్తే. తెలంగాణ భవన్‌కు వచ్చినా హాట్ టాపికే. అసెంబ్లీకి అటెండ్ అయితే అందరిలో క్యూరియాసిటీ. అలాంటి సీనే మళ్లీ రిపీట్ అయింది. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్ కేసీఆర్ మీడియా ముందుకు వచ్చారు.కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై కాంగ్రెస్ సర్కార్ తీరును తూర్పార బట్టారు. ఇక పోరు బాటే అంటూ హెచ్చరించారు. ఆ తర్వాత వారం రోజుల్లోనే అసెంబ్లీ స్టార్ట్ అయింది. మొదటి రోజు సమావేశాలకు సార్ అటెండ్ అయ్యారు. ప్రధాన ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్ దగ్గరికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పలకరించారు. ఆ తర్వాత సభలో 5 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు మాజీ సీఎం. దీంతో కేసీఆర్ సభకు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇంతకు జనవరి 2 నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు కేసీఆర్ వస్తారా రారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో నందినగర్‌లోని తన నివాసంలో ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తూ..శాసనసభా వేదికగా సర్కార్‌ను ఇరకాటంలో పెట్టే ప్లాన్ చేస్తున్నారట గులాబీ దళపతి.అటు సర్కార్ కూడా జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌లో కృష్ణా గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎజెండాను కూడా ఫిక్స్ చేసింది. జనవరి 2న కృష్ణా, 3న గోదావరి బేసిన్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు తమకు కూడా అవకాశం ఇవాలని ప్రతిపక్షం బీఆర్ఎస్ కోరుతోంది. కీలక అంశాలపై అసెంబ్లీలో చర్చ జరగనున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ సభకు వస్తారా రారా అన్నదే ఆసక్తికరంగా మారింది.అయితే జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు అటెండ్ కావాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. కృష్ణా-గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని నిజానిజాలు చెప్పాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు టాక్. అసెంబ్లీకి హాజరుపై ముఖ్యనేతల సమావేశంలో గులాబీ బాస్ ఇండైరెక్ట్ హింట్ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఏ అంశంపై అయినా చర్చకు మనం రెడీగా ఉన్నామ్. ప్రిపేర్ అయి రావాల్సింది అధికార పక్షం. మనది డైరెక్ట్ అటాకే. నీటి లెక్కలన్నీ నాలుక మీదే ఉన్నాయని కేసీఆర్ అన్నట్లుగా తెలుస్తోంది. దీంతో సార్ సభకు వస్తారన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది.కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై మీడియా సమావేశంలో కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు..సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చించేందుకు ప్రభుత్వం రెడీగా ఉందని..దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని ఛాలెంజ్ చేశారు. దీంతో తాను సభకు హాజరు కాకపోతే



ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే స్వయంగా తాను సభకు హాజరై..కృష్ణాజలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టాలని డిసైడ్ అయ్యారట గులాబీ బాస్.ఇరిగేషన్ విషయంలో సీఎంతో సహా మంత్రులెవరికీ సరైన అవగాహన లేదనేది కేసీఆర్ అంచనా అంటున్నారు. అందుకే వాళ్లు మాట్లాడాలంటే ప్రిపేర్ అయి రావాలి. మనది డైరెక్ట్ అటాకే అని కారు పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారట. మొత్తం అసెంబ్లీ సెషన్‌కు కాకపోయినా..నదీ జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చకు మాత్రం తాను తప్పకుండా అటెండ్ కావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే.. విమర్శలు, ప్రతి విమర్శలు..వాగ్వాదాలు..సభ ఎంత ఇంట్రెస్టింగ్‌గా కొనసాగుతుందో చూడాలి.

# త్వరలో 14 వేల పోలీస్ కానిస్టేబుళ్ల భర్తీ

**హైదరాబాద్, డిసెంబర్ 31:**నిరుద్యోగులకు భారీ శుభవార్త. కొత్త సంవత్సరం 2026లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుంది. సరికొత్తగా జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్ చేసి శాఖల వారీగా ఖాళీలతో నివేదికలను రూపొందిస్తోంది. తాజాగా రిటైర్మెంట్లు పెరగడంతో ఏర్పడిన ఖాళీలను పదోన్నతులతో పాటు, నేరుగా నోటిఫికేషన్లతో నియమించుకోవాలన్న యాక్షన్ ప్లాన్ కు తుది మెరుగులు దిద్దుతోంది.ప్రైవేట్ రంగంలో భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం.. ప్రభుత్వ రంగంలోనూ ఆయా శాఖల్లోని ఖాళీలను భర్తీకి పెద్ద సంఖ్యలో ఉద్యోగాల నియామకాలను చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం జనవరి, ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆర్టీసీలో 198 సూపర్ వైజర్ పోస్టులు, పోలీస్ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు, యూనివర్సిటీల నియామకాల్లో జాప్యం, పలు శాఖల్లో కారుణ్య నియామకాలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.పోలీస్ శాఖలో త్వరలో భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 14వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నామని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సుమారు 14వేల స్టయిపెండరీ క్యాడెట్ కానిస్టేబుళ్లతోపాటు ఇతర యూనిఫామ్ సర్వీసుల కానిస్టేబుళ్ల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉన్నాయని డీజీపీ తెలిపారు. నూతన సంవత్సరంలో దీనికి సంబంధించిన ప్రకటన వెలవడుతుందని ఆయన చెప్పారు.తెలంగాణ పోలీసు శాఖలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు.తెలంగాణ పోలీసు శాఖలో ఖాళీల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురు. రాష్ట్రంలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు




డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. చాలా కాలంగా నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్న వేలాది మంది అభ్యర్థుల్లో ఈ ప్రకటన కొత్త ఆశలు చిగురింపజేసింది. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో.. 'తెలంగాణ నేర వార్షిక నివేదిక-2025'ను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. డీజీపీ ప్రకటనతో త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇక రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్న విమర్శలను డీజీపీ కొట్టిపారేశారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య 2.33 శాతం మేర తగ్గుముఖం పట్టిందన్నారు. 2023 నవంబర్ నాటికి రాష్ట్రంలో 2,34,158 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది నవంబర్ నాటికి ఆ సంఖ్య 2,28,695కు తగ్గిందని చెప్పారు. ముఖ్యంగా అల్లర్ల సంఖ్య 42 శాతం తగ్గడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని డీజీపీ పేర్కొన్నారు. శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.'రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల ప్రతిష్ఠకు భంగం కలిగించే కేసులు గత ఏడాదితో పోల్చితే 9.02 శాతం పెరిగాయి. 2021లో 4,476 గా ఉన్న ఇటువంటి కేసులు, 2025 నాటికి 6,476కు చేరుకోవడం గమనార్హం. మహిళలపై మొత్తం నేరాల సంఖ్య కూడా 3.16 శాతం పెరిగి 20,551కి చేరింది. అయితే, అత్యాచారాలు, వరకట్న వేధింపులు, కిడ్నాప్‌లు, ఆత్మహత్య ప్రేరణ వంటి కేసులు తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశం. మోసపూరితంగా శారీరక సంబంధం పెట్టుకునే ఉదంతాలపై కొత్తగా అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద ఈ ఏడాది 69 కేసులు నమోదు చేశాం.దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు 41 శాతం పెరుగుతుంటే.. తెలంగాణలో మాత్రం పోలీసుల ముమ్మర కసరత్తు వల్ల 3 శాతం తగ్గాయి. సైబర్ నేరాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు దేశస్థాయిలో 6 శాతం తగ్గగా, తెలంగాణలో ఏకంగా 21 శాతం తగ్గుదల నమోదైంది. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (%+జూదీ%) కృషి ఫలితంగా ఈ ఏడాది 24,498 మంది బాధితులకు రూ.159.65 కోట్లను తిరిగి ఇప్పించగలిగారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన 'ఈగల్' బృందం ఈ ఏడాది విశేష ఫలితాలను సాధించింది. సుమారు రూ.172.93 కోట్ల విలువైన డ్రగ్స్‌ను జప్తు చేశారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదులో 30.36 శాతం పెరుగుదల కనిపించింది, అంటే నిఘా పెరగడం వల్ల నేరస్థులు ఎక్కువగా పట్టుబడుతున్నారు. ఇక మావోయిస్టుల విషయానికి వస్తే, తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఏడాది 509 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.' అని డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు.

## గజగజ వణికిస్తున్న చలి

- మొదటి పేజీ తరువాయి

'ఆరెంజ్ అలర్ట్' జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.భాగ్యనగరంలో కూడా చలి తీవ్రత ఊహించని స్థాయిలో పెరిగింది. సాధారణంగా కాస్త వెచ్చగా ఉండే హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడం గమనార్హం. శేరిలింగంపల్లిలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నగరంలోని ఇతర ప్రాంతాలైన రాజేంద్రనగర్ 10 డిగ్రీల సెల్సియస్, మౌలాలి 10.2 డిగ్రీల సెల్సియస్, గచ్చిబౌలి 10.9 డిగ్రీల సెల్సియస్ వంటి చోట్ల కూడా చలి గాలులు తీవ్రంగా ఉన్నాయి. తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో ఆఫీసులకు వెళ్లేవారు. పాఠశాల విద్యార్థులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వాతావరణ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఈ ఏడాది డిసెంబర్ నెలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. దీనికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మేఘాలు లేకపోవడం వల్ల భూమి పగటిపూట గ్రహించిన వేడి రాత్రివేళ త్వరగా అంతరిక్షంలోకి వెళ్ళిపోతోంది. హిమాలయాల నుంచి వీస్తున్న పొడి, శీతల గాలులు నేరుగా తెలంగాణ మీదుగా ప్రవహిస్తున్నాయి. రాత్రి సమయాల్లో భూమి ఉపరితలం వేగంగా చల్లబడటం వల్ల కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అత్యంత శీతల ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ 5.6 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చలి నుంచి తట్టుకోవడానికి ఉదయం, రాత్రి సమయాల్లో చలిమంటలనే ఆశ్రయిస్తున్నారు. రాబోయే రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నందున.. వృద్ధులు, చిన్నపిల్లలు ఉదయం పూట బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేడి ఆహారం, గోరువెచ్చని నీటిని తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## అసెంబ్లీలో రేవంత్‌ను ఎదుర్కొనేందుకు హరీష్‌కు పవర్స్

- మొదటి పేజీ తరువాయి



పాటు, మహిళా, బీసీ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని సబితా ఇంద్రారెడ్డి, తలాసానిలకు ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. వీరు ముగ్గురూ సభలో పార్టీ పక్షాన కీలక అంశాలపై చర్చను నడిపించనున్నారు. శాసనమండలిలో ఎల్. రమణతో పాటు పి.సతీష్ రెడ్డిని ఉప నేతలుగా ఎంపిక చేశారు. సభ్యులను సమన్వయం చేసేందుకు దేశపతి శ్రీనివాస్‌ను పార్టీ విప్‌గా నియమించారు.అసెంబ్లీలో సబిత, తలసానికి కూడా డిప్యూటీ లీడర్ హోదా ఇచ్చినప్పటి హరీష్ రావు మాత్రమే అధికారపక్షాన్ని ముఖ్యంగా రేవంత్ రెడ్డిని ఎదుర్కోనున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యే అవకాశాలు లేకపోవడంతో ఈ నియామకాలు ఆసక్తికరంగా ఉన్నాయి. గతంలోనూ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని హరీష్ రావే ఎదుర్కొన్నారు. కేటీఆర్ ఎక్కువగా జోక్యం చేసుకునేవారు కాదు. ఈ సారి నేరుగా హరీష్ రంగంలోకి వస్తున్నారు.

## మీకు రోజూ తగినంత కాల్షియం అందుతుందా

**ఎవరెవరికి ఎంత కాల్షియం కావాలో తెలుసుకోండి.!**

**వి.శ్రావణ్ కుమార్ మెడికేర్ హాస్పిటల్ కోహెడ**

**కోహెడ** :మన శరీరానికి అవసరమైన ముఖ్యమైన మినరల్స్‌లో కాల్షియం ఒకటి. ఇది ఎముకలను దృఢంగా ఉంచుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. కాల్షియం ఉన్న ఆహారాలను తీసుకుంటేనే మనకు కాల్షియం బాగా లభిస్తుంది. దీంతో ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇక పెద్దల్లో సుమారుగా 1200 నుంచి 1400 గ్రాముల కాల్షియం ఉంటుంది. ఇది 99 శాతం వరకు వారి ఎముకలు, దంతాల్లోనే ఉంటుంది. మిగిలిన 1 శాతం శరీరంలోని ఇతర భాగాల్లో ఉంటుంది. కనుక ఈపాటికే మీకు అర్థమైపోయి ఉంటుంది. ఎముకలకు ఎంతగా కాల్షియం కావాలో. కనుక కాల్షియం ఉండే ఆహారాలను రోజూ తీసుకోవాలి.కాల్షియం కేవలం ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచడమే కాదు. పలు ఇతర పనులకు కూడా అవసరం అవుతుంది. దీని వల్ల గుండెకు మేలు జరుగుతుంది. గుండె కొట్టుకునే వేగం నియంత్రించ బడుతుంది. కండరాల పనితీరుకు అవసరం అవుతుంది. మెదడు ఆలోచించేందుకు, శరీర పెరుగుదలకు కూడా కాల్షియం అవసరం అవుతుంది.పెద్దలకు రోజుకు సుమారుగా 800 మిల్లీగ్రాముల మేర కాల్షియం కావాలి. అదే యువత, గర్భిణీలు, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు రోజుకు 1200 మిల్లీగ్రాముల కాల్షియం అవసరం. అయితే కాల్షియం సులభంగా లభించాలంటే అవి ఉన్న ఆహారాలను రోజూ తినాలి. ముఖ్యంగా మనకు కాల్షియం నువ్వుల్లో అధికంగా లభిస్తుంది. వీటిని గుప్పెడు మోతాదులో రోజూ పెనంపై కాస్త వేయించి తినాలి. లేదా నువ్వులు, బెల్లంతో తయారు చేసే నువ్వుల లడ్డూను రోజుకు ఒకటి తిన్నా చాలు..మనకు కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మారుస్తుంది.ఇక కాల్షియం మనకు ఇతర ఆహారాల్లోనూ అధికంగా లభిస్తుంది. అంజీర్ పండ్లు, రాజ్మా, ఆవాలు, పాలు, డ్రైఫ్రూట్స్,నట్స్, ములగ ఆకు నారింజలు, రొయ్యలు, గుడ్లు, పెరుగు వంటి ఆహారాలను తరచూ తీసుకుంటుంటే కాల్షియం బాగా లభిస్తుంది. దీంతో కాల్షియం లోపం రాకుండా చూసుకోవచ్చు. ఇక మనం తినే ఆహారాల్లో ఉండే కాల్షియంను శరీరం సరిగ్గా శోషించుకోవాలంటే అందుకు "విటమిన్ డి" అవసరం అవుతుంది. కనుక కేవలం కాల్షియం మాత్రమే కాదు. విటమిన్ డి కూడా సరిగ్గా లభించేలా చూసుకోవాలి. ఇందుకు గాను ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య సుమారుగా 20 నిమిషాల పాటు శరీరానికి ఎండ తగిలేలా ఉండాలి. దీంతో మన శరీరం విటమిన్ డిని దానంతట అదే తయారు చేసుకుంటుంది. ఇది కాల్షియం శోషణకు అవసరం అవుతుంది. అలాగే రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొవ్వును కరిగిస్తుంది. కనుక కాల్షియం పొందాలంటే విటమిన్ డి కూడా లభించేలా చూసుకోవాలి.విటమిన్ డి మనకు రోజుకు 10 నుంచి 20 మైక్రోగ్రాములు లేదా 400 నుంచి 800 ఐయూ మేర అవసరం అవుతుంది. ఇది సూర్య రశ్మితోపాటు పుట్టగొడుగులు, నారింజ పండ్లు, మాంసం, గుడ్లు, పాలు వంటి ఆహారాల ద్వారా లభిస్తుంది. కనుక విటమిన్ డి, కాల్షియం రెండూ సమపాళ్లలో అందినప్పుడే మన శరీరంలో ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

## కొత్త ఏడాదిగా ఘన స్వాగతం...

- మొదటి పేజీ తరువాయి

బాణసంచా వెలుగులతో మెరిసిపోయింది.సుమారు 5 నిమిషాల పాటు సాగిన ఈ కనువిందులో 3,500 రకాల బాణసంచాను స్కై టవర్ అంతస్తుల నుంచి కాల్చారు. అయితే, అక్కడి వాతావరణం వేడుకలకు కాస్త ఆటంకం కలిగించింది. భారీ వర్షం, ఉరుముల సూచన ఉండటంతో న్యూజిలాండ్ నార్త్ ఐలాండ్‌లోని పలు చిన్న కమ్యూనిటీ ఈవెంట్లను రద్దు చేశారు. అయినా ప్రధాన వేడుకలు మాత్రం వర్షంలోనే కొనసాగాయి. ఆక్లాండ్ కంటే ముందే, పసిఫిక్ మహాసముద్రంలోని మారుమూల దేశమైన 'కిరిబాటి'లోని ఓ అటోల్ (కిరితిమతి దీవి) ప్రపంచంలోనే తొలిసారిగా 2026లోకి అడుగుపెట్టింది. అక్కడి అనుభవాన్ని ఓ పర్యాటకుడు వివరిస్తూ.. "శాటిలైట్లు లేవు, మనుషుల జాడ లేదు, చిమ్మచీకటి, లెక్కలేనన్ని పీతలు మాత్రమే ఉన్నాయి" అంటూ ప్రకృతి ఒడిలో న్యూ ఇయర్ జరుపుకున్నట్లు తెలిపారు. ఇక 600 మంది జనాభా మాత్రమే ఉండే న్యూజిలాండ్ చాతం ఐలాండ్‌లోనూ కొత్త ఏడాది సంబరాలు జరిగాయి. తెల్లవార్లూ తమ బృందం వేడుకలు చేసుకుంటుందని అక్కడి ఓ హోటల్ యజమాని పేర్కొన్నారు. ప్రపంచంలోని తూర్పు దేశాల నుంచి పడమర వైపునకు కొత్త సంవత్సరం 2026 నెమ్మదిగా విస్తరిస్తోంది.

# యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదు..

**హైదారాబాద్, డిసెంబర్ 31:** యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదు అయ్యింది. దేవీ దేవతలను దూషించారంటూ అన్వేష్‌పై సినీనటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళ్యాణి ఫిర్యాదు మేరకు అన్వేష్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 352,79,299, ఐటీ చట్టంలోని 67 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. త్వరలో అన్వేష్‌కు పంజాగుట్ట పోలీసులు నోటీసులు జారీ చేయనున్నారు. అన్వేష్ వివాదాస్పద కామెంట్స్‌పై తెలంగాణలో వరుస ఫిర్యాదులు చేస్తున్నారు. మరోవైపు అన్వేష్‌ను దేశ ద్రోహిగా ప్రకటించాలని, అతడిని భారత్‌కు రప్పించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఇటీవల హిందూ దేవతలపై యూట్యూబర్ అన్వేష్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన కామెంట్స్‌ను తప్పుబడుతూ అన్వేష్ ఓ వీడియో చేశారు. అయితే ఆ వీడియోలో హిందూ దేవతలను కించపరిచే విధంగా మాట్లాడటం సంచలనంగా మారింది. హిందువులు దేవతగా కొలిచే సీతమ్మ వారిపై, అలాగే ద్రౌపది దేవి గురించి అన్వేష్ అసభ్యకరమైన రీతిలో మాట్లాడారు. దీంతో దేవతల పట్ల అన్వేష్ తీరుపై హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. యూట్యూబర్ కామెంట్స్‌కు నిరసనగా తెలుగు రాష్ట్రాల్లో అన్వేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.




## దుర్గంచెరువు ఆక్రమణలకు 'హైడ్రా' చెక్

**- 5 ఎకరాల మేర కబ్జాల తొలగింపు**

**హైదరాబాద్ సిటీ:** నగరంలో పేరొందిన దుర్గం చెరువు చుట్టూ పెరిగిపోయిన కబ్జాలను హైడ్రా అరికడుతోంది. మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు మంగళవారం దాదాపు 5 ఎకరాల మేర ఉన్న కబ్జాలను తొలగించింది. మట్టితో నింపి వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని వినియోగిస్తూ ప్రతి నెలా రూ. 50 లక్షల వరకు అద్దె వసూలు చేస్తున్న దందాకు సంస్థ చెక్ పెట్టింది.




**మట్టితో నింపుతూ ఆక్రమణలు..**

ఇనార్బిట్ మాల్ వైపు ఏకంగా 5 ఎకరాలు కబ్జాలకు గురైనట్లు అధికారులు ఇటీవల గుర్తించారు. 10 నుంచి 15 మీటర్ల మేర మట్టితో నింపి క్రమంగా చెరువులోకి జరిగి కబ్జా చేసి, ఆ స్థలం తనదంటూ ఓ ప్రజా ప్రతినిధి క్లెయిమ్ చేస్తున్న విషయాన్ని తెలుసుకున్నారు. సదరు వ్యక్తి స్కూల్ బస్సులు, ఐటీ సంస్థలకు చెందిన వాహనాల పార్కింగ్‌తో ప్రతి నెలా రూ.50 లక్షల వరకూ అద్దెలు అనుభవిస్తూ పార్కింగ్ దందా చేస్తున్నాడని గుర్తించారు. రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించారు. కాగా ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న చెరువు ప్రస్తుతం 116 ఎకరాలుగా మిగిలిపోయింది.

## నార్లాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

**మేడారం జాతర దృష్ట్యా కీలక ముందడుగు**

**ములుగు:** తాడ్వాయి మండలం మేడారం నందు నూతనంగా నిర్మించిన నార్లపూర్ పోలీస్ స్టేషన్‌ను గౌరవ రాష్ట్ర పంచాయతీ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్క గారు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ములుగు జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామనాథ్ కేకాన్ ఐపీఎస్ గారి అధ్యక్షతన జరుగగా కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర గారు, ఓఎస్డీ శ్రీ శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్ గారు పాల్గొన్నారు.ఈ పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ అధికారి ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుల్ స్థాయిలలో సుమారుగా 30 మంది పనిచేయనున్నారు. ఈ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం మేడారం మహాజాతర దృష్ట్యా ఎల్లప్పుడూ ప్రజలకు భక్తులకు గుత్తికొయా గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.జాతర సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేగవంతమైన పోలీస్ సేవల అందించడంలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.నార్లాపూర్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారిగా ఎస్ ఐ ఏ. కమలాకర్ గారు విధులు నిర్వహించనున్నారు, పస్రా పరిధిలో ఈ స్టేషన్ పనిచేస్తుంది పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దయాకర్ గారు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు.జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు, ఇది ప్రజలకు మరింత చేరువైన, సమర్థవంతమైన సేవలకు నాంది పలుకుతుందని అన్నారు.




## బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ కీలక భేటీ చర్చించిన అంశాలివే

**హైదరాబాద్:** బీఆర్ఎస్ నేతలతో మాజీ సీఎం-బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. నందినగర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం.ఇందులో భాగంగానే ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి కేవలం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే నిర్మించిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపణ. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు నదులపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి వాటాలు పరిష్కరించామని ఆ పార్టీ చెప్పుకొస్తోంది.ఇదే విషయంపై కొద్ది రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారి తీసింది. వీటన్నింటికీ అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది?ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే పార్టీ నేతలకు కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.




# యూరియా కోసం మళ్లీ కష్టాలు

**వరంగల్, డిసెంబర్ 31:**తెలంగాణలో రైతులకు యూరియా సమస్య ఇంకా తీరలేదు. నెలలు గడుస్తున్నా, సాగు సీజన్ కొనసాగుతున్నా రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన ఒక ఘటన అద్దం పడుతోంది. పొలాలకు సకాలంలో ఎరువులు అందక, పంటలు ఎండిపోతాయనే ఆందోళనతో అన్నదాతలు పడుతున్న అగచాట్లు వర్ణనాతీతంగా మారాయి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడినా ప్రయోజనం లేకపోయింది.తమ కళ్ల ముందే పంటలు దెబ్బతింటుంటే చూస్తూ భరించలేక, కనీసం ఎరువులు ఇప్పించమని కోరుతూ ఒక రైతు ఏకంగా వ్యవసాయ అధికారి కాళ్ల మీద పడి వేడుకోవడం అందరినీ కలిచివేసింది. నిన్న (శనివారం) పంపిణీ కేంద్రానికి వచ్చిన రైతులకు తగినన్ని యూరియా బస్తాలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర నిరాశ ఎదురైంది. అధికారులు అక్కడి నుండి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా, తమకు ఎలాగైనా యూరియా కావాలని రైతులు అడ్డుకున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను కాపాడుకోవాలనే ఆవేదనతోనే కనీసం ఒక్క యూరియా బస్తా ఇప్పించండి బాంచన్ నీకాళ్లు మొక్కుతా అంటూ.. ఆ రైతు అధికారుల కాళ్ళు మొక్కి ప్రాధేయపడాల్సి వచ్చింది. ఈ హృదయవిదారక దృశ్యం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల కొరత, రైతుల కష్టాలపై గత కొన్ని నెలలుగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఇది కేవలం ఒక్క రైతు గోస మాత్రమే కాదు, ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్రంలోని మొత్తం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితికి అద్దం పడుతోంది. పలు జిల్లాల్లో యూరియా బస్తాల కోసం అర్ధరాత్రి నుంచే క్యూ లైన్లు కనిపిస్తున్నా యూరియా తమ చేతికి రావడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# ఐ బొమ్మ రవి కస్టడీ రిపోర్ట్‌లో కీలక అంశాలు...

**హైదరాబాద్, డిసెంబర్ 31:** ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రకాలుగా సినిమా ప్రింట్‌ను రవి కొనుగోలు చేశారు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇక ఐబొమ్మ రవి సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసులు అతడి ద్వారా తెలుసుకున్నారు. అయితే ఈ నగదు లావాదేవీలన్నీ ఐబొమ్మ రవి డాలర్ల రూపంలోనే చేసినట్లు గుర్తించారు. ఇక రాకేష్ అనే వ్యక్తి ద్వారా ట్రైడ్ మార్క్ లైసెన్స్, చేసినట్లు పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోనే రవి ఆఫీస్ నడిపినట్లు కస్టడీ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. దాదాపు 12 రోజుల కస్టడీ అనంతరం మంగళవారం అతడిని జైలుకు పోలీసులు తరలించారు. ఈ కస్టడీలో ఐ బొమ్మ రవి కీలక అంశాలు వెల్లడించారు. వాటిని తమ కస్టడీ రిపోర్టులో పొందుపరిచిన అంశాలను కోర్టుకు పోలీసులు అందజేశారు. ఈ మొత్తంలో దాదాపు రూ. 10 కోట్లు విలాసవంతంగా గడపడానికి ఖర్చు చేశాడు. హైఫై పబ్‌లు, ఫైవ్ స్టార్ హోటళ్లలోనే బస చేయడం ద్వారా లగ్జరీ లైఫ్ ఎంజాయి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. ప్రస్తుతం రవి అకౌంట్‌లో రూ. 3 కోట్ల నగదును పోలీసులు ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.



బెట్టింగ్, పైరసీ ద్వారా వచ్చిన నగదుతో రవి జల్సాలు

# మాయం అవుతున్న గుట్టలు

**హైదరాబాద్, డిసెంబర్ 31:**రాత్రి పడితే చాలు మొరం మాఫియా రాత్రికి రాత్రి గుట్టలను గుటుక్కుమని మాయం చేస్తున్నారు. గ్రామ శివారులు పట్టణ శివారు లతోపాటు చెరువులు గుట్టలను తవ్వేస్తూ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. సెలవు దినాలతో పాటు రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టరాజ్యంగా మొరం తరలిస్తూ లక్షలాది రూపాయలను అర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని జుక్కల్ మద్నూర్ బిచ్కుంద పిట్లం పెద్ద కోడాప్గల్ నిజాంసాగర్ బీర్కూర్ నస్రుల్లాబాద్ నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి బాన్సువాడ, బీర్కూర్ కోటగిరి వర్ని చందూర్ పోతంగల్ రుద్రూర్ మోస్రా మండలాల్లో మొరం, మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతుంది.అనుమతులు లేకుండా భారీగా మొరం తరలిస్తూ అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.ఒకటి టిప్పర్ వంటి వాహనాలకు మొరం కు ప్రభుత్వం నుంచి ఒక టన్నుకు రాయల్టీ డీఎంఎఫ్, ఎస్ఎంటి, ఇతర పన్నులు అన్ని కలిపి ఒక టన్నుకు రూ.56 రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక టిప్పర్ కు సుమారు రూ. 900 రాయల్టీ చెల్లించాలి. కానీ ఇవేవీ లేకుండానే మొరం తరలింపు చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మొరం ఒక్కో టిప్పర్ ధర రూ 4000 నుండి 4500 వరకు విక్రయిస్తున్నారు.రోజువారీగా సగటున బాన్సువాడ మండలం నుండే లక్షల్లో వాల్టా రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉండగా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రాయల్టీ సొమ్ము, అక్రమార్కుల జేబుల్లోకి వెళుతుండడంతో గుట్టలు స్వాహా చేస్తున్న మాఫియా పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మొరం కావాలంటే సవా లక్ష నియమ నిబంధనలు పెట్టే అధికారులు. అక్రమ రవాణా చేసే వ్యాపారులకు ఎలాంటి నిబంధనలు వర్తించవు. సెలవు వచ్చిందంటే చాలు ఏ అనుమతులు ఉండవు. సర్కారుకు వాల్టా రాయల్టీ చెల్లించరు.అయినా రాత్రి, పగలు అనే తేడా లేకుండా మొరం కొల్లగొడుతారు. ప్రభుత్వానికి ఎలాంటి వాల్టా రాయల్టీ చెల్లించకుండా అధికారులకు మచ్చిక చేసుకొని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట మొరం దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాన్సువాడ మండలం కొల్లూరు శివార్లలో, సోమేశ్వర్, దేశాయిపేట్, బుడిమి, జక్కల దాని తాండ కెనాల్ శివార్లలో గ్రామ శివారులోని గుట్టల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి.టిప్పర్లలో నిత్యం వందల ట్రిప్పుల మొరాన్ని సోమేశ్వర్ శివారు ప్రైవేట్ వెంచర్, బాన్సువాడ లోని ప్రైవేటు వెంచర్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. అక్రమ రవాణా రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ తెరవెనుక ఈ అక్రమ దందా అధికారులు సంపూర్ణంగా వ్యాపారులకు సహకరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ అక్రమ దందాకు అధికారులు అండగా ఉండడంతో మూడు పువ్వులు ఆరుకాయలుగా విరజిల్లింది.దీంతో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ఈ అక్రమ దందా కు వత్తాసు పలకడంతో వ్యాపారులకు ఈ అక్రమ దందా ద్వారా కాసులు వర్షం కురిపించేందుకే అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులే ప్రభుత్వ గండి కొడుతున్న మాఫియాకు వత్తాసు పలుకుతూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.అధికారులకు ఏదైనా సమాచారం తెలుసుకు నేందుకు ఫోన్ చేస్తే మండల అధికారులు, జీపిఓలు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం బట్టి చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉన్నదో ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ మొరం తరలించే వారికి అండగా ఉన్న మండల ఆయా శాఖల అధికారుల పై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు ఇంత జరుగుతున్న రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తు న్నారని ఆరోపణలు ఉన్నాయి.అక్రమార్కులు రాత్రిపూట తవ్వకాలు జరిపి గుట్టలను, చెరువులను మాయం చేస్తున్నారు. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికార పార్టీకి చెందిన నాయకుల పేరు చెప్పి తవ్వకాలు చేపడుతున్నారు. మొరం మాఫియా ఆగడాలు మితిమీరడంతో వనరులు, వృక్ష సంపద కనుమరుగవుతున్నది.అనుమతులు లేకుండా సాగుతున్న మొరం వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. మొరం వ్యాపారం చేయాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉన్నది. కానీ బాన్సువాడ డివిజన్లో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అక్రమ మొరం,మట్టి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు మామూలు తీసుకొని అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల పేరిట అధికారులకు తెలుపుతూ ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్న ఇండ్ల నిర్మాణాలు, వెంచర్లు ఇతరత్రా నిర్మాణాలకు రాత్రి సమయాల్లో మట్టి, మొరం విక్రయాలతో వ్యాపారం సాగిస్తున్నారు. మట్టి, మొరం అక్రమ తవ్వకాలను నియంత్రించాలని స్థానికులు పేర్కొంటున్నారు.సెలవు దినాల్లో,రాత్రి వేళలో జరుగుతున్న అక్రమ మురం తవ్వకాలు రవాణాకు రెవిన్యూ పోలీస్ శాఖలో కొంతమంది అధికారులు కుమ్మక్కు అయినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు పోలీస్ శాఖ పనిలో ఎదుట నుండే అక్రమ మొరం రవాణా సాగుతున్న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు ఉన్నాయి.



## తగినంత యూరియా వుంది



**కలెక్టర్**

**సిద్దిపేట:**రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దని జిల్లాలో సరిపడినన్ని యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు సూచించారు.మీర్దొడ్డి మండలం అల్వాల గ్రామంలోని రైతు వేదికలో యూరియా కార్డుల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు యాసంగి సీజన్ లో ఎక్కడ కూడా యూరియా కొరత రాకుండా పగడ్బందిగా ప్రణాళిక ప్రకారం అన్ని సెంటర్ లలో యూరియా బస్తాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. మీ ప్రాంతాల్లోని వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని మీ యొక్క పాసు బుక్ తీసుకుని వచ్చి యూరియా కార్డులను తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఒక ఎకరాకు 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చెయ్యాలని వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. కౌలు రైతులు సైతం అధైర్య పడవద్దని మీరు చేస్తున వ్యవసాయ క్షేత్ర పట్టేదార్ పాస్ బుక్ లేదా జిరాక్స్ తీసుకువస్తే యూరియా అందిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న యూరియా కొరత కథనాలను నమ్మవద్దని ప్రతి రైతుకు యూరియా అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ తదితరులు ఉన్నారు.

## ఫౌండేషన్ సేవలు మరింత విస్తరిస్తాం...

**- సైనిక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అరిగెల రాకేష్**

**మెట్ పల్లి:**పేదలకు సాయం చేయడానికి ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తామని మెట్ పల్లి సైనిక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అరిగెల రాకేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మెట్ పల్లి సైనిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం ప్రాంతానికి చెందిన పుసులూరి నవ్య అను మహిళ సహకారంతో రోడ్డు పక్కన ఉండే అభాగ్యులకు చలికాలంలో రక్షణగా దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే మరికొన్ని నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. అలాగే మెట్ పల్లి పెద్దమ్మ దేవాలయం వద్ద ఉన్న గోశాలకు నెలకు సరిపడా పశుగ్రాసం అందించారు. ఈ సందర్భంగా సైనిక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అరిగెల రాకేష్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలని ఉద్దేశంతో ఫౌండేషన్ స్థాపించడం జరిగిందన్నారు. ఫౌండేషన్ తో పాటు కొంతమంది ఉదార స్వభావంతో అందిస్తున్న ఆర్థిక సహాయంతో శివ కార్యక్రామాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ సేవలను మరింత విస్తరించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సైనిక్ ఫౌండేషన్ సభ్యులు పోతుగంటి వినోద్, మిట్టపల్లి కార్తీక్, కోయల్కర్ హరీష్, కురుమ శెట్టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ జోన్ కాప్రా సర్కిల్లో
# అక్రమ నిర్మాణాల జోరు

**సుప్రీంకోర్టు ఆర్డర్ లో కూడా కూల్చివేతలు చేయవద్దని లేదని వున్నా అధికారులు మాత్రం మరో రూటు**

**అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి భారీ నష్టం**

**కాప్రా సర్కిల్ పరిధిలో రెచ్చిపోతున్న అక్రమ నిర్మాణదారులు**

**కూల్చివేతలు లేకపోవడంతో విచ్చలవిడిగా నిర్మాణాలు**

**డివిజన్ల విభజన పనిని ఆసరాగా చేసుకుని బిల్డర్ల అక్రమాలు నిర్మాణాలు**

**అధికారుల పర్యవేక్షణ లోపంతో కొనసాగుతున్న ఉల్లంఘనలు**

**కాప్రా సర్కిల్ పరిధిలో కార్యాలయంలో అక్రమ నిర్మాణాలలో చైన్మెన్ల హవ**







**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31 (స్కై న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ పరిధిలోని కాప్రా సర్కిల్లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా సంబంధిత ఉన్నతాధికారి చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంతో చైన్మెన్ల చేతివాటంతో బిల్డర్లు రెచ్చిపోతున్నారని ఆల్ ఇండియా హిందుస్థాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బొట్ల సాయిలు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ చర్లపల్లి, కాప్రా డివిజన్లలో అక్రమ నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నప్పటికీ అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారని, టిపిఓ అసిస్టెంట్ అయిన చైన్మెన్ శ్రీధర్ కు ఒక చేతి లేకపోవడంతో, రెండు చేతులు వున్నా ఎలా పనులు ఫీల్డ్లో చేస్తారని ఆయన అన్నారు. కూల్చివేతలు చేపట్టకపోవడం వల్ల అక్రమ నిర్మాణదారులు మరింత ధైర్యంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని స్థానికులు తెలిపారని ఆయన అన్నారు. కాప్రా పరిధి చూసే రమేష్ చైన్మెన్ అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప సీజింగ్ చేసే చర్యలు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీని వెనుక పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగాయా అన్న అనుమానం వస్తుందని ఆయన అన్నారు.ప్రస్తుతం జీహెచ్ఎంసీ డివిజన్ల విభజన పనిలో అధికారులు నిమగ్నమై ఉండటాన్ని అదనుగా చేసుకొని అక్రమ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడంతో చైన్మెన్లు, క్రింది స్థాయి సిబ్బంది అందినకాడికి వసూళ్ల దండుకుంటూ వసూళ్ల రాయులుగా మారినా చైన్మెన్లు పరిమితమవుతున్నారని ఆయన తెలిపారు. నిర్మాణ దశలోనే అక్రమ భవనాలను సీజ్ చేయాల్సిన సమయంలో కూడా చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ కింది స్థాయి ఉద్యోగులు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ఆయన అన్నారు. సీజ్ చేసిన భవనాలపై ఉన్న రిబ్బన్లు, ఫ్లెక్సీలు తొలగించి మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తునరాని, దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారని ఆయన అన్నారు. కేవలం సీజింగ్ చర్యలకే పరిమితం కాకుండా కూల్చివేతలు చేపట్టినప్పుడే అక్రమ నిర్మాణాలకు చెక్ పడుతుందని ఆయన స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ నష్టాన్ని నివారించాలని, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారని ఆయన అన్నారు.

# విద్యుత్ శాఖ కార్యాలయంలోకి కాలనీల మురుగు

**తీవ్ర దుర్గంధంతో వినియోగదారులు, సిబ్బందికి ఇబ్బంది**

**మున్సిపాలిటీ స్పందించాలని కోరుతున్న ఏఈ వినోద్**





**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 31:-** రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ లో తమ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా ఉంచుకున్న మున్సిపాలిటీ అధికారులు సిబ్బంది ఇతర కార్యాలయాల ఇబ్బందిని మాత్రం పట్టించుకోవడం లేదు దీనితో ఎక్కడెక్కడ నుంచో కాలువలా వస్తున్న మురుగు నేరుగా వచ్చి షాద్ నగర్ పరిగి రోడ్డులో గల విద్యుత్ శాఖ కార్యాలయంలోకి చేరుతుంది ఇక్కడ అడుగుపెట్టిన దుర్గంధమయమైన పరిస్థితులు ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా మరోవైపు దుర్గంధాన్ని భరించలేక సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు కార్యాలయంలోకి అడుగుపెట్టి చీదరింపు కొడుతున్న వినియోగదారులు మున్సిపల్ కమిషనర్ గారు ఇది న్యాయమేనా అంటూ నిలదీస్తున్నారు సమీపంలో కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పైకాలనీల నుంచి మురుగు వరదలా వచ్చి ఈ కార్యాలయంలోకి చేరుతుంది దీనితో కార్యాలయం అంతా దుర్గంధ మయంగా మారుతుంది కాలువల వ్యవస్థ పై మున్సిపాలిటీ శ్రద్ధ చూపక పోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని విద్యుత్ శాఖ సిబ్బంది ఆవేదనవ్యక్తం చేస్తున్నారు ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఈ సమస్య నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు ఈ వ్యవహారం పై పట్టణ ఏఈ వినోద్ మీడియాతో మాట్లాడుతూ దుర్గంధం ఏమైనా ఈ ప్రాంతంలో కనీసం ఉద్యోగం చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు పలు సందర్భాల్లో మున్సిపల్ కమిషనర్ అదే విధంగా ఇతర కార్యాలయ సిబ్బందికి ఎన్నిసార్లు తమ ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని తమ సమస్య పరిష్కారం కావడంలేదని దీంతో ఇప్పుడు కార్యాలయం మొత్తం దుర్గంధమయమై ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయిందని ఆయన ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు తాము మున్సిపాలిటీకి సంబంధించిన అనేక విద్యుత్ కు సంబంధించిన పనులు చేస్తున్నామని ఎంత సహకరిస్తున్నామని కానీ తమకు మాత్రం ఏ మాత్రం వారు సహకరించడం లేదని ఏ ఈ వినోద్ ఆందోళన వ్యక్తం చేశారు.

## నట్టల నివారణతోనే ఉత్పాదకత పెంపు...



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 31( స్కై న్యూస్)** పశువులు గొర్రెలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టాల నివారణ మందులను వేయడం ద్వారా వాటిలో రోగ నిరోధక శక్తి పెరిగే ఉత్పాతకత పెరుగుతుందని మండల పశు వైద్యాధికారులు డాక్టర్ కల్పన డాక్టర్ అశోక్ లు వివరించారు బుధవారం మండల పరిధిలోని శ్రీపురం మరియు పుల్జాల గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించి 7802 గొర్రెలకు మరియు712 మేకలకు నట్టల నివారణ మందులను వేయడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని నట్టాల నివారణ మందులను మూగజీవాలకు వేయించాలని వారు కోరారు. మందులు వేయడం వల్ల అంతర పరాల జీవులు నిర్మూలించడంతోపాటు బరువు పెరుగుతాయని వివరించారు ఈ కార్యక్రమంలో శ్రీపురం సర్పంచ్ కూచుకుళ్ళ గీతా నరసింహారెడ్డి ఉప సర్పంచ్ వెంకటయ్య పశు వైద్య సిబ్బంది మాధ్యనాయక్ శ్రీశైలం వినయ్ సతీష్ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు

## డిప్యూటీ కమిషనరేట్ ఏర్పాటుతో
# పలు మార్పులు...

**నేరాల నిరోధణకు పూర్తి అవకాశం**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టీకరణ**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 31:-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ ప్రాంతం ఇక పటిష్టమైన రక్షణ వలయంగా మారబోతుందని డిప్యూటీ కమిషనరేట్ ఏర్పాటుతో పలు మార్పులు సంభవించనున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మార్పు కారణంగా నేరాల నిరోధానికి పూర్తి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు అదేవిధంగా ఇప్పటిదాకా శంషాబాద్ పరిధిలో ఉన్న నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ మండలాలు షాద్ నగర్ పరిధిలోకే వస్తాయన్నారు దీనివల్ల అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరం అవుతాయని వెల్లడించారు అదేవిధంగా కేశంపేట మండలం ఆమనగల్ ఏసీబీ పరిధిలోకి వెళ్లినట్లుగా ప్రచారం జరిగిందని, ఇది వాస్తవం కాదని అన్నారు మొదట పోలీసు శాఖ ఆ విధంగా రూట్ మ్యాప్ ఏర్పాటు చేసినప్పటికీ తాను అభ్యంతరం చెప్పడం జరిగిందన్నారు ప్రస్తుతం కేశంపేట కూడా షాద్ నగర్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని వెల్లడించారు దీనివల్ల పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి విలువైన సేవలు అందిస్తారని ఆయన స్పష్టం చేశారు షాద్ నగర్ పారిశ్రామిక ప్రాంతంగా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెంది ఉండటం వల్ల నేరాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు అదేవిధంగా 44వ నెంబరు జాతీయ రహదారి ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కూడా ఆస్కారం ఎక్కువగా ఉందన్నారు ఈ నేపథ్యంలో పోలీసు శాఖ మరింత పటిష్టం కావడం వల్ల నేరాలను, ఘోరాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు నియోజకవర్గాన్ని నేరాలకు దూరంగా ప్రశాంతంగా ఉంచడమే తన లక్ష్యమని పేర్కొన్నారు అంతకుముందు మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి దంపతులు అదేవిధంగా మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, సర్పంచులు అఖిల్, భాస్కర్ గౌడ్ కేశంపేట సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు కేశంపేట మండలం సంబంధించిన వినతి పత్రాన్ని సమర్పించారు అయితే ఎమ్మెల్యే ముందుగానే ఈ సమస్యకు పరిష్కారం చేయడం జరిందని సమాచారం.

## షాద్ నగర్ నియోజకవర్గానికి హైమాస్ కాంతులు

**షాద్ నగర్ బిజెపి ఇన్చార్జ్ అందే బాబయ్య హర్షం**



షాద్ నగర్ నియోజకవర్గానికి హైమాస్ కాంతులను అందజేస్తూ మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ 19 హైమాస్ లైట్లు మంజూరు చేయించారు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ అందే బాబయ్య ఈ విషయాన్ని తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు ఫరూక్ నగర్ కొందుర్గు చౌదరిగుడా కేశంపేట మండలాలలో గ్రామీణ ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేయించేందుకు మెటీరియల్ పంపించడం జరిగిందని ఆయన వివరించారు మన అందరి ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు గ్రామాల అభివృద్ధితో దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని, బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రపంచంలో భారతదేశం మేటి దేశంగా ఆవిర్భవించిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## సప్త శక్తి సంఘ సమావేశం



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 31(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వేద నగర్ లో గల శ్రీ సరస్వతి శిశు మందిర్ లో సప్త-శక్తి సంఘం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్త్రీలో ఉన్న సప్త-శక్తి గుణాలను ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఏ. శ్రీలత వివరించారు.సప్త-శక్తి గురించి భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉండగా వాటిలో విభూతి యోగంలో 34వ శ్లోకం చెప్పబడిన విధంగా స్త్రీలలో ఏడు రకాల శక్తులు దాగి ఉంటాయి. కీర్తి, శ్రీ, స్మృతి,ధృతి, వాక్కు, మేధ, క్షమ, గురించి వివరించారు. ఒక కుటుంబం స్త్రీ మీదే ఆధారపడి ఉంటుంది. ఆ స్త్రీ చదువుకున్నవారైతే ఆ ఇంటిలో అందరూ అక్షరాస్యులు అవుతారు. స్త్రీ ద్వారానే కుటుంబాలు ఏర్పడి వంశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా సప్త-శక్తి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

## సుగంధ పరిమళాలు పుస్తకాన్ని అందజేసిన మేడికొండ బాష

**చిన్న వయసులోనే మేడికొండ బాష కవిత్వంపై పట్టుదల ఉండడం అభినందనీయం**

**తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు**



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 31(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం మేడికొండ గ్రామానికి చెందిన కవి రచయిత మేడికొండ బాష తను రచించిన సుగంధ పరిమళాలు పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్ లోని నందినగర్ లో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసి సుగంధ పరిమళాలు పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మేడికొండ బాష ను ఆశీర్వదిస్తూ , దీవించారు. చిన్న వయసులోనే కవిత్వం పై పట్టుదల పెట్టుకోవడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కవిత్వం పట్ల మేడికొండ బాష ఉన్నతమైన స్థానానికి ఎదగాలని మరోసారి ఆశీర్వదించారు.

## ఘనంగా మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు



**దేవరకద్ర అమరచింత డిసెంబర్ 31 (స్కై న్యూస్);** అమరచింత పట్టణంలో దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో దేశాయి ప్రకాష్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేశాయి ప్రకాష్ రెడ్డి మాతృమూర్తి దేశాయ్ అనసూయమ్మ లిఫ్ట్ అధ్యక్షురాలు సౌజన్య రెడ్డి అమరచింత ఎస్సై స్వాతి చేతుల మీదగా పుర ప్రముఖుల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వీట్ చాక్లెట్లు పంపిణీ చేయడం జరిగింది. దేశాయి మురళీధర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి చికిత్స పొందుతున్న బాధితులకు దుప్పట్లు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగింది. దేశాయి మురళీధర్ రెడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారి విద్యార్థుల చేత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ జెడ్పిటిసి రాజేంద్ర సింగ్ కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి అయుబ్ ఖాన్ ఆత్మకూరు మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్సై రాజు భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మెరువ రాజు షేక్ అహ్మద్ క్యామ భాస్కర్ వెంకటేశ్వర రెడ్డి ఐ,రాంరెడ్డి జయసింహారెడ్డి వెంకట్ రెడ్డి నాగేశ్వర్ రెడ్డి దేశాయి ప్రకాష్ రెడ్డి సేవాసమితి అధ్యక్షులు సయ్యద్ కలాం పాషా రాకేష్ గౌడ్ సర్దార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాలా శ్రావణ్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 31 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతుల 21వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను వారు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు ఎల్లప్పుడు అన్యోన్యంగా ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే వారిని అభినందించారు ఈ సందర్భంగా దంపతులు ఇరువురు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా స్థానిక జర్నలిస్టు కె.పి, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి సీనియర్ జర్నలిస్టులు రాఘవేందర్ గౌడ్ శరత్ తదితరులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు

వార్తాతరంగాలు



## "జనవరి అంతా ఆపరేషన్ స్మైల్ బాల కార్మికత్వంపై కఠిన చర్యలు"




**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 31 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల్ జిల్లాలో బాల కార్మికత్వనీ నిర్మూలన లక్ష్యంగా జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు 12వ ఆపరేషన్ స్మైల్ కోఆర్డినేషన్ మీటింగ్‌ను నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేక పోలీస్ బృందాలు ఫీల్డ్‌లోకి వెళ్లనున్నాయని వెల్లడించారు. ఈ బృందాలతో పాటు డి.డబ్ల్యు.ఓ, సి.డబ్ల్యు.సి, డి.ఎల్.ఓ. తదితర శాఖల అధికారులు కూడా సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గుర్తించిన బాల బాలికలను షెల్టర్ హోంలకు తరలిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని, 14 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిని కౌన్సిలింగ్‌కు పిలుస్తామని తెలిపారు. బాలల భవిష్యత్తు పరిరక్షణే ఆపరేషన్ స్మైల్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు గద్వాల్ డిఎస్పీ వై. మొగులయ్య, సి.డబ్ల్యు.సి. డిపార్ట్మెంట్ నుంచి చైర్‌పర్సన్ సహదేవుడు, మెంబర్స్ శైలజ, డి.డబ్ల్యు.ఓ. డిపార్ట్మెంట్ నుంచి డీ.సీ.పీ.ఓ. నరసింహనాయుడు, సి.డి.పి.ఓ. దీప్తి, ఆర్డిఓ కార్యాలయం నుంచి ఏవో వెంకటస్వామి, డి.ఈ.ఓ. కార్యాలయం నుంచి జి.సి.డి.ఓ. అంపయ్య, డి.ఎం.హెచ్.ఓ. కార్యాలయం నుంచి డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ రాజు, డి.ఎల్.ఓ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ అబ్రహం, డి.ఎస్.ఎల్.ఓ కార్యాలయం నుంచి ఎస్.డబ్ల్యూ. నాగరాజు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కోఆర్డినేటర్ శైలజ ఆపరేషన్ స్మైల్ టీం ఎస్సై కేశవరావు మరియు పోలీస్ సిబ్బంది, డి.సి.ఆర్.బి. ఎస్సై సుకూర్, తదితరులు పాల్గొన్నరు.

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు శ్రీవారి ప్రసాదాన్ని అందచేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 31:-** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు అదేవిధంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో వీర్లపల్లి గ్రామ సర్పంచ్ పాండు తదితరులు పాల్గొన్నారు.

## పురపాలికల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి...



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 31(స్కై న్యూస్):**పురపాలికల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగానే సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ ఎన్నికలు, పురపాలికల్లో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా పురపాలికల్లో ఉన్న వార్డుల వారీగా ఓటర్ల ఫైనల్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పబ్లిష్ చేసేందుకు అవసరమైన ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా రెండు, మూడు వార్డులకు కలిపి ఒక రిటర్నింగ్ అధికారిని నియమించాలన్నారు. ఒక్కో వార్డులో 850కు పైగా ఓటర్లు ఉంటే రెండు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా పురపాలికల్లో ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బంది స్థానికులు కాకుండా ఇతర మండలాల వారిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై కలెక్టర్ సమీక్షిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా మంజూరైన ఇండ్లన్నీ వంద శాతం నిర్మాణ దశలోకి వెళ్లే పూర్తి బాధ్యత ఆయా మున్సిపల్ కమిషనర్లదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇండ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు జనవరి 6లోగా అన్ని అనుమతులు పూర్తయి మార్కౌట్ చేసి ఇస్తే పునాదులు నిర్మించుకోవచ్చన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ వేగవంతం కావడానికి సంబంధిత వార్డు అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. గద్వాల, ఐజ, వడ్డేపల్లి, అలంపూర్ పురపాలికల్లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంతో ఎన్నికల కోడ్ వచ్చేలోగానే టెండర్ పూర్తయి పనులు ప్రారంభించేలా మొత్తం ప్రక్రియను సంబంధిత ఇంజనీర్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీసీ రహదారులు, మురుగు కాలువలు, పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, తదితర పనులు చేస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో స్థలం సమస్య లేకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఆయా అభివృద్ధి పనులకు టెక్నికల్ శాంక్షన్ పూర్తి చేసుకుంటే మిగిలిన ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. అన్ని పురపాలికల్లో జనవరి 20వ తేదీలోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభం కావాలని, అలసత్వం వహించే ఇంజనీర్లపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ సమావేశంలో హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు జానకి రామ్ సాగర్, శంకర్ నాయక్, సైదులు, రాజయ్య, డిఈ క్రాంతి, ఏఈలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ బంధువులకు నమస్కారం



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 31(స్కై న్యూస్):**ఎన్నో జన్మల పుణ్యఫలం మన గద్వాలలో గద్వాలలో జరిగే విశ్వ విశ్వశాంతి మహా యజ్ఞం. 17 రోజులపాటు నిర్విరామంగా బ్రాహ్మణుల వేదమంత్రోచ్ఛారణ మధ్యన జరుగు ఈ యాగం చూసినా ఫలం, వీక్షించిన ఫలం. కాబట్టి హిందూ బంధువులందరూ మన జిల్లాలో జరిగే ఈ మహత్తర కార్యం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఈ యాగాలను విజయవంతం చేద్దాం. రండి కదలిరండి హిందూ చైతన్యం కోసం పాటుపాడుదాము రండి.

# షాద్ నగర్ పోలీసు శాఖ పునర్వ్యవస్థీకరణ...

### ఇకపై షాద్ నగర్ కు డీసీపీ అధికారి ఏర్పాటు
### షాద్ నగర్ డిసిపి జోన్ పరిధిలో 9 మండలాలు
### షాద్ నగర్, ఆమన్ గల్ ప్రాంతాలకు వేరువేరుగా ఇద్దరు ఏసీపీలు
### షాద్ నగర్ ఏసిపి పరిధిలో చౌదరి గూడెం, కొందుర్గు, కొత్తూరు, నందిగామ, షాద్ నగర్
### ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి షాద్ నగర్ నియోజకవర్గం
### ప్రజలకు మెరుగైన సేవలు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 30:-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరణ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో నూతనంగా ఏర్పాటుచేసిన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి షాద్ నగర్ చేరింది రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గెజిట్ లో షాద్ నగర్, ఆమన్ గల్ లను కలిపి ఒక డిసిపి జోన్ గా ఏర్పాటు చేశారు ఇందులో షాద్ నగర్ డిసిపి జోన్ హెడ్ క్వార్టర్ కార్యాలయంగా ఉండడం విశేషం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ కోసం కొత్త కమిషనరేట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు షాద్ నగర్ కు డిసిపి అధికారి కొత్తగా నియామకము జరుగుతుంది షాద్ నగర్ డిసిపి జోన్ పరిధిలో మొత్తం తొమ్మిది మండలాలు చేరాయి ఇందులో షాద్ నగర్ ఏసిపి పరిధిలో చౌదరి గూడెం, కొందుర్గు, కొత్తూరు, నందిగామ, షాద్ నగర్ ప్రాంతాలు ఉండగా అమన్ గల్ ఏసిపి పరిధిలో అమన్ గల్, కేశంపేట, మాడుగుల, తలకొండపల్లి మండలాలు ఉన్నాయి నియోజకవర్గంలోని కేశంపేట మండలం ఆమన్ గల్ ఏసిపి పరిధికి వెళుతుంది మిగతా పోలీస్ స్టేషన్లను షాద్ నగర్ ఏసిపి పరిధిలోకి వస్తాయి ప్రభుత్వం ఈ నూతన నిర్ణయం తీసుకోవడంతో గతంలో నందిగామ, కొత్తూరు మండలాలకు శంషాబాద్ ఏసిపి పరిధి





నుండి విముక్తి లభించినట్టు అయింది షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలకు శాంతిభద్రతలలో మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీతో ఈ ప్రాంతాన్ని అనుసంధానం చేయడం ఆసక్తికర పరిణామం అని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు గతంలో నందిగామ కొత్తూరు ఈ నియోజకవర్గం నుండి వేరుగా శంషాబాద్ ఎసిపి పార్థికి వచ్చేవని ఇప్పుడు షాద్ నగర్ హెడ్ క్వార్టర్ గా డిసిపి అధికారి కార్యాలయం మనవద్దని ఏర్పాటు కావడం సంతోషించదగ్గ పరిణామం ఆయన పేర్కొన్నారు ప్రజలకు మెరుగైన సేవలు శాంతి పద్ధతుల పరిరక్షణ నేర నియంత్రణలో భాగంగా పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరణ చేసిన ప్రభుత్వం భవిష్యత్తులో ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం విశేషమని చెప్పారు అదేవిధంగా డిసిపి జోన్ గా ఈ ప్రాంతాన్ని ఏర్పాటు చేసే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని తాను కలిసినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు ముఖ్యంగా ఎస్పి రంక్ అధికారి షాద్ నగర్ కేంద్రంగా ఉండడం శుభపరిణామం శాంతిభద్రతల విషయంలో మెరుగైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు కేశంపేట మండలం ఏసిపి పరిధి ఆమన్ గల్ ఏర్పాటు కావడంతో తిరిగి ఆ మండలాన్ని ఇక్కడ చర్చేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.

# ఏ హోదాలో కాంగ్రెస్ నాయకుడు సమీక్ష నిర్వహిస్తారు..?

### ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వేసిందేవరు..?
### హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి: బిజెపి డిమాండ్

**నారాయణపేట డిసెంబర్ 31: (స్కైన్యూస్)** నారాయణపేట నియోజకవర్గంలో ఎవరు ఎమ్మెల్యేనో ప్రజలకు అంతుపట్టడం లేదని,పార్టీ నాయకుని హోదాలో అభివృద్ధి పనులపై డి డి సి మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం ఎలా నిర్వహిస్తారని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగు రావు నామాజీ అన్నారు.బుధవారం నారాయణపేట లో బిజెపి రాష్ట్ర నాయకులు కే. రతంగ్ పాండు రెడ్డి,జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్,కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జి.రఘువీర్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్,మీడియా ఇంఛార్జి కిరణ్ లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ నాయకుల నిర్వాకంతో జిల్లా కేంద్రంలో 65 వేల మంది చుట్టూ పక్కల మండలాల ప్రజలు ఆస్పత్రి లేక వైద్యానికి దూరమయ్యారనీ అన్నారు.ఆస్పత్రి తరలించిన ప్పటి నుంచి దాదాపు 40 మంది వైద్యం అందక ప్రాణాలు కోల్పోయారని అందుకు కాంగ్రెస్ నాయకులు బాధ్యత వహించాలని అన్నారు.ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు వస్తున్నందున ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు హడావిడి చేస్తున్నారనీ అన్నారు.బిజెపి ఉద్యమం చేసినప్పుడల్లా ఏరియా ఆస్పత్రి పేరును జిల్లా ఆస్పత్రి గా మారుస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు.తాజా గా ఆస్పత్రి అభివృద్ధి కమిటీతో నాటకాలు ఆడుతున్నారని అన్నారు.కమిటీని ఎవరు నియమించారు ఒక డాక్టర్ పేరున చైర్మన్ గా కలెక్టర్ గౌరవ సభ్యులుగా మంత్రి,ఎమ్మెల్యేలు.ఎంపి కమిటీ సభ్యులు గా కుంభం శివకుమార్ రెడ్డి,కృష్ణ,పద్మ పేర్లను ప్రకటించారని తెలిపారు. అంతే కాకుండా కలెక్టర్,మంత్రి,ఎంపి,ఎమ్మెల్యేలు లేకుండానే కేవలం ఒక సభ్యుడు శివకుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.అలాగే కాంగ్రెస్ కార్యాలయంలో నియోజక వర్గం అభివృద్ధి పై సమీక్ష ఏ హోదాలో నిర్వహించారని ప్రశ్నించారు.ప్రభుత్వం అంటే కాంగ్రెస్ పార్టీ అనుకున్నారా అని మండిపడ్డారు.ఈ సమావేశానికి హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడిని అంటూ చిట్టెం మాధవరెడ్డి అధికారులను భయపెడుతూ అవినీతికి పాల్పడుతున్న ఆరోపణలు ఉన్నాయని అన్నారు.దీంతో తమ ఎమ్మెల్యే ఎవరోనని ప్రజలు,అధికారులు అయోమయానికి గురవుతున్నారన్నారు.రెండేళ్ల కాలంలో నియోజక వర్గంలో ఒక్క అభివృద్ధి పని అయినా చేశారా అని అన్నారు.కేంద్రం నిధులతోనే పనులు జరుగుతున్నాయని అన్నారు.వీరి పాలనలో అవినీతి రాజ్యం ఎలుతున్నదని అన్నారు.కాంగ్రెస్ కు ఎన్నికల్లో ప్రజలు గట్టి గుణపాఠం నేర్పాలని కోరారు.రైతు బాంధవుడు నరేంద్ర మోడీఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే



బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో ఏడాదికి 6వేల పంట సహాయం నేరుగా ప్రధాని కిసాన్ సమ్మన్ పేరుతో ఖాతాల్లో జమ చేశారని నాగు రావు నామాజీ అన్నారు.రైతులు ఎవరు అడగ కుండానే ప్రధాని కిసాన్ సమ్మాన్ ను 10 వేలకు పెంచి ప్రధాని నరేంద్రమోడీ రైతు బాంధవుడిగవనిలిచారాన్నారు.కానీ బిజెపికి ఎక్కడ పేరు వస్తుందో నని కిసాన్ సమ్మణ్ డబ్బులు పొందని లక్షన్నర రైతుల జాబితా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా రైతులకు న్యాయం చేస్తున్నదని అన్నారు.అలాగే రెండేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని ఇస్తే ఉచిత బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వం కనక ఇవ్వకుండా ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదని అన్నారు.ఈ కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

# శ్రీ గోపాల దాసులవారి చరిత్ర

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 31 (స్కై న్యూస్):**శ్రీ గోపాల దాసులవారు 1721వ సంవత్సరంలో రాయచూరు జిల్లాకు చెందిన 'మెసరకల్లు' అనే గ్రామంలో జన్మించారు. వీరికి 'భాగణ్ణ' అని నామకరణం అయినది. వీరి తండ్రి మురహరి రాయలు, తల్లిపేరు వెంకమ్మ, భాగణ్ణ దారుల వారికి ముగ్గురు సహోదరులు ఉన్నారు. ఆరు దాసప్ప దాసరు. శ్రీనప్ప దాసరు, రంగప్ప దాసరు, భాగణ్ణ దాసులవారి 8వ యేట వారి తండ్రి మురహరి రాయలు మరణించినారు. అప్పుడు తల్లి వెంకమ్మ, నలుగురు కుమారులతో సంకాపురం గ్రామమునకు చేరుకొని అక్కడే ఊరిబైట ఆంజనేయుని దేవస్థానములో నివాసముండెడివారు. అయిజలో కూలి చేసి పిల్లలను తల్లి వెంకమ్మ పోషించినది. అక్కడే భాగణ్ణ దాసుల వారికి ఉపనయనము జరిగినది. భాగణ్ణ దాసుల వారికి సంకాపురములోనే గాయత్రీ మంత్రం సిద్ధించినది. దాసుల వారికి వారి గురువయిన విజయదాసుల వారితో 'గోపాల విఠల' అని ఆదవాని గ్రామంలో అంకిత ప్రధానమయినది. అప్పటినుండి వీరిపేరు "గోపాల దాసుల వారు" (అప్రోక్షజ్ఞాని) అని ప్రసిద్ధి అయినది. ఆ తరువాత ఉత్తనూరు గ్రామానికి చేరుకొని అక్కడే నివాసమున్నారు. ఇక్కడ ధన్వంతరి వేంకటేశ్వరుని ఆలయంలో చేసుకుంటూ, 'గోపాల విఠల' అనే అంకితములో అనేక కీర్తనలు రచించినారు. వారి



గానంతో వేంకటేశ్వరున్ని మెప్పించేవారు. గోపాల దాసుల వారి శిష్యులయిన జగన్నాథ దాసులవారు కడుపు నొప్పితో వీరి దగ్గరికి రాగా వీరికి ఉన్న అపమృత్యువును తొలగించడానికి వీరికి వున్న 80 సంవత్సరముల ఆయుష్యులో 40 సంవత్సరాలు జగన్నాథ దాసుల వారికి ఆయుష్య దానం చేసి అపమృత్యువును హరించినారు.

గోపాల దాసుల వారికి మరియు వారి సహోదరులైన ముగ్గురు తమ్ముళ్ళలో ఇద్దరు వివాహం చేసుకోలేదు. చివరి తమ్ముడు రంగప్ప దాసుల వారికి మాత్రం వివాహం జరిగినది శ్రీ దాసుల వారికి 40వ యేట ఆయుష్య తీరటం వల్ల 1765వ సంవత్సరంలో చిత్రభాను నామ సంవత్సరం, పుష్యమాసం, కృష్ణాష్టమి, ఆదివారమునాడు వైకుంఠవాసులైనారు, శ్రీ దాసులవారు మళ్ళీ 200 సంవత్సరల తరువాత రంగప్ప దాసుల వంశంలో జన్మిస్తానని చెప్పారు. వారు జన్మించిన తరువాత 12 సంవత్సరాలకు ఉత్తనూరులో ఊరిబయట ఉన్న పీర్లబావిలోంచి వారి ఆస్థికలను వారే తీసుకుని కాశీలో కలిపి వస్తానని చెప్పారు. అంతే కాకుండా వారి వంశస్థులలో నిరుపేదరికం అనుభవించేటప్పుడు జన్మిస్తానని, తరువాత వారి ఇంట్లో భూగతమై వున్న సాహిత్యం (బియ్యం) తీసి అన్న సంతర్పణ చేస్తానని చెప్పారు. నాలుగు వందల సంవత్సరాల క్రితం శ్రీ గోపాల దాసుల వారు స్వహస్తాలతో లిఖించిన చిత్రపటములు (విశ్వ రూపములు) నాలుగు (ప్రపంచ సృష్టి గురించి) వున్నవి. అప్రోక్ష జ్ఞానులలో భవిష్యత్ గురించి చెప్పిన మహా జ్ఞాని గోపాల దాసుల వారు పూజించిన విగ్రహములు ప్రతి సంవత్సరం మూడు రోజులు మాత్రమే భక్తుల దర్శనార్థం బయటికి తీయడం ఉత్తనూరు గ్రామ ఆచారంగా జరుగుతున్నది.

# టెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి








**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం డిసెంబర్ 31 (స్కై న్యూస్ ):**టెట్ పరీక్షలు అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలకమైన పరీక్షలు కావడంతో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో టెట్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్, అధనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యచందన,సంబంధిత శాఖల అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనవరి 2026లో 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీలలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి 11.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో టెట్ పరీక్షలకు మొత్తం 1017 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని కలెక్టర్ వెల్లడించారు.టెట్ పరీక్షల నిర్వహణ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సుజాతనగర్ మండలం అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్, పాల్వంచ మండలం అనుబోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు.పరీక్షల పర్యవేక్షణ కోసం ముగ్గురు అబ్జర్వర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టే విధంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమలు చేయాలని తెలిపారు.పరీక్షలు పూర్తిగా ఆన్లైన్ విధానంలో నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని కంప్యూటర్లు, నెట్‌వర్క్ కనెక్టివిటీ సక్రమంగా పనిచేసేలా ముందుగానే పరిశీలించాలని, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఐటీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. జనవరి 3వ తేదీన మాక్ టెస్ట్‌ను అబ్జర్వర్ల పర్యవేక్షణలో నిర్వహించి, అన్ని కంప్యూటర్లు సరిగా పనిచేస్తున్నాయా లేదా ధృవీకరించాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించిన అనంతరమే అనుమతించాలని తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని, గుర్తింపు కార్డు పరిశీలించిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు.అభ్యర్థులకు పరీక్షా హాల్ వివరాలు సులభంగా తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, శౌచాలయాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. దివ్యాంగ అభ్యర్థులకు అవసరమైన సహాయకులను నియమించాలని సూచించారు.పరీక్షల సమయంలో మెడికల్ క్యాంపులు సిద్ధం చేసి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, ముందుగానే జనరేటర్లు, ఇన్వర్టర్లు అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించుకోవాలని తెలిపారు.పరీక్ష ప్రారంభానికి ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకోవాలని, పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే గేట్లు మూసివేయాలని తెలిపారు. ఒకసారి గేట్లు మూసిన తరువాత ఎవరికీ లోపలికి అనుమతి ఉండదని, అలాగే పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎవరినీ బయటకు అనుమతించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేదా లోపాలు తలెత్తితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.టెట్ పరీక్షలు ప్రశాంతంగా, న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించే దిశగా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ అనుబోస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దయాకర్ రావు, అబ్జర్వర్లు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరిమళించిన మానవత్వం

## అనాధ వృద్ధురాలి శవానికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంకళ్ళ చెన్నయ్య



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 31:**-సమాజంలో వివిధ కారణాలతో బంధాలను తెంచుకోవడంతో ఎంతో మంది అనాథలుగా మిగులుతున్నారు కుటుంబ సభ్యుల చేత అంతిమ సంస్కారానికి నోచుకోని అభాగ్యులుగా లోకం విడుస్తున్నారు అయినవారు ఉన్నా అనాథ శవంగా రోడ్డు పక్కన పడివున్న ఓ వృద్ధురాలి శవానికి అన్నీ తానై అంత్యక్రియలు చేసి తన మానవత్వాన్ని చాటుకున్నాడు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య వివరాల ప్రకారం వెళితే షాద్ నగర్ మునిసిపాలిటీ పరిధిలోని పటేల్ రోడ్డుకు చెందిన భారతమ్మ అనే వృద్ధ మహిళ బిక్షాటన చేస్తూ జీవనం కొనసాగించేది భారతమ్మ కుటుంబానికి భారమై, అందరూ ఉన్నా అనాథగా పట్టణంలోని శ్రీనగర్ కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ఉంటుంది అక్కడే ఉంటూ అనారోగ్యంతో వృద్ధురాలు మృతి చెందింది దీంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య, కాంగ్రెస్ యువ నాయకుడు నీరటి వాసు, అశోక్ చారి, వెంకటేష్, అక్బర్, మజార్, విజయ్, రాజమోని జగదీష్, మున్సిపల్ జవాన్ రామాంజనేయులు, సిబ్బంది సాయంతో అంత్యక్రియలు జరిపారు మృతురాలికి పటేల్ రోడ్డు లో సొంత ఇల్లు ఉండడమే కాకుండా తనకంటూ అయినవారు ఉన్నా రోడ్డు పక్కన దిక్కు లేని శవంగా ఉండడం చూసి పలువురు ఆవేదన వ్యక్తం చేశారు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటిన కొంకళ్ళ చెన్నయ్య తో పాటు మిగతావారిని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తోపాటు పలువురు అభినందించారు

## షాద్ నగర్ ఎమ్మెల్యేగా వై. అంజయ్య యాదవ్ మళ్లీ గెలవాలని కోరుతూ కార్యకర్త శబరి యాత్ర



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 31:**- రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బాబు ముదిరాజ్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కు వీరాభిమాని తమ నేత ఓడిపోవడంతో ఆందోళన చెందిన ఆయన వచ్చే ఎన్నికల్లో నైనా తమ నేత ఘనవిజయం సాధించాలని కోరుతూ శబరిమల యాత్ర మొదలు పెట్టాడు అంజన్న ఉంటేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో తంగడపల్లి శ్రీను, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# పేట లో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన శివారెడ్డి



**నారాయణపేట డిసెంబర్ 31: (స్కై న్యూస్)** నారాయణపేట వ్యవసాయ మార్కెట్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో బుధవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శివారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ప్రభుత్వం క్వింటాలకు కందికి8 వేల రూపాయలు మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు.ప్రతి రైతు ఎకరానికి 6 క్వింటాళ్లు చొప్పున రైతులు అమ్ముకో వచ్చని అన్నారు. ప్రతి రైతు కూడా పట్టాదారు పాసుపు స్తకం, బ్యాంకు అకౌంట్ జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్, అగ్రికల్చర్ ఏఈఓ ధ్రువీకరణ పత్రం తప్పకుండా తీసుకొని రావాలని ఆయన తెలిపారు, ఈ అవకాశాన్ని రైతులందరూ కూడా సద్వినిగం చేసుకోవా లని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డిఎంఓ బాలమణి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ భారతి , గంజి అసోసియేషన్ ప్రెసిడెంట్ సంగు మంగల్గి, ఏఎంసి డైరెక్టర్ తయార్ హుస్సేన్, బి శరణప్ప, సంఘ సీఈవో అశోక్ కుమార్, సంఘ సిబ్బంది శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా జడ్జిఐలు కోర్టు కేలండర్ తీసుకురావటం అభినందనీయం





**కొత్తగూడెం డిసెంబర్ 31 (స్కై న్యూస్ );**ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్యు ). భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026 వాల్ కేలండర్ ను కొత్తగూడెం బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ ఆవిష్కరించారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఐలు కోర్టు కేలండర్ తీసుకురావటం అభినందనీయమని అయన అన్నారు.ఈ సందర్భంగా ఐలు కోర్టు పాకెట్ కేలండర్ ను కూడా జిల్లా జడ్జి చేతుల మీదుగా విడుదల చేశారు.కేలండర్ ఆవిష్కరణ అనంతరం ఐలు ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జడ్జి కేక్ కటింగ్ చేశారు.ఈ కార్యక్రమానికి ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత,రెండవ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ రవి కుమార్ ,మణుగూరు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ సూరెడ్డి,కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి భాగం మాధవ రావు,ఐలు నేషనల్ కౌన్సిల్ సభ్యులు జలసూత్రం శివరాం ప్రసాద్, ఐలు జిల్లా అధ్యక్షులు యమ్.వీ. ప్రసాద రావు ,ఐలు రాష్ట్ర కార్యదర్శి పొనుగోటి కిషన్ రావు ,కటికం పుల్లయ్య మీసాల వెంకటేశ్వర్లు, ఐలు మహిళా వింగ్ కమిటీ సభ్యులు గాదె సునంద జి.కే.అన్నపూర్ణ కొత్తగూడెం కోర్టు కమిటీ అధ్యక్ష కార్యదర్సులు రావిలాల రామా రావు, కిలారు పురుషోత్తం రావు,కోర్టు కమిటీ నాయకులు దుంద్రు రమేష్ నంబూరి రామకృష్ణ దూదిపాల రవి కుమార్ తెల్లబోయిన రమేష్ ఉప్పు అరుణ్ పగిడిపల్లి రవి దేశబోయిన రాజేందర్ అభిషేక్ కోర్సా పాపా రావు మణుగూరు కోర్టు కమిటీ అధ్యక్ష కార్యదర్సులు పోశం భాస్కర్, రామ్మోహన్ భద్రాచం కోర్టు కమిటీ అధ్యక్షుడు బండారు అరుణ్ చంద్ పాల్గొన్నారు

# కే కృష్ణ తన సొంత ఖర్చులతో ప్రయాణికుల సౌకర్యం కోసం బస్ స్టాండ్ ఏర్పాటు





**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 31:**- రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండల కేంద్రం లో షాద్ నగర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రంలో ఓ యువ నాయకుడు కే కృష్ణ ముందుకు వచ్చి ప్రయాణికులకు ఇబ్బంది తొలగించడానికి ఓ యువ నాయకుడు ముందుకు వచ్చాడు మండల కేంద్రంలో శాశ్వత ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణం కోసం స్థానిక సర్పంచ్ శ్వేత చంద్రబాబు తో కలసి భూమి పూజ పనులకు శ్రీకారం చుట్టారు ఈ సందర్భంగా కే కృష్ణ మాట్లాడుతూ ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ ఉండటంతో పాటు ఎండాకాలం,వానాకాలం వల్ల ప్రయాణికులకు అనేక ఇబ్బందులు పడటం చూసి శాశ్వత పరిష్కారం చూపాలని ఉదేశ్యంతో ఆర్టీసీ బస్ స్టాండ్ ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజల చిరకాల వాంఛను నెర వేర్చాలనేదే నా కోరిక అన్నారు ఇకముందు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఏదైనా సహాయం చేయడానికి నా వంతుగా కృషి చేస్తానని అన్నారు ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇప్పటివరకు సొంతంగా గ్రామ పంచాయతీ భవనం లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులను చూసిన కేకే కృష్ణ పెద్ద మనసుతో ముందుకు వచ్చి శాశ్వత బస్టాండ్ ఏర్పాటుకు సొంత నిధులతో చేయడం గర్వించదగ్గ విషయం అని అన్నారు. అంతేకాకుండా సొంత గ్రామ పంచాయతీ లేకపోవడం పై స్పందిస్తూ,ప్రజలకు,అధికారులకు అందుబాటులో ఉండేందుకు పాలన కోసం ప్రభుత్వం భవనం నిర్మాణం అయ్యేంత వరకు రేకులతో కూడినది ఏర్పాటు చేస్తున్నట్లు కేకే హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు శాశ్వత బస్టాండ్ ఏర్పాటు,గ్రామ పంచాయతీ నిర్మాణం పై మండల ప్రజలు హర్ష్యం వ్యక్తం చేస్తున్నారు

# షాద్ నగర్ లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 31:**- రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ డివిజన్ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ 56 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎస్ఎస్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురవేశారు ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో కేరళలోని త్రివేంద్రం లో ఎస్ఎఫ్ఐ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలతో ఏర్పడిందని అధ్యయనం పోరాటం నినాదంతో ముందుకెళ్తుందని అన్నారు చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ విద్యా రంగం, విద్యార్థి సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు గత 56 సంవత్సరాల నుంచి విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాల నిర్వహిస్తూ దేశంలోని అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందని అన్నారు ఎన్నికలు జరిగినా ఎస్ఎఫ్ఐ గెలవడం అందుకు నిదర్శనమని అన్నారు విద్యార్థుల సమస్యలపై స్కాలర్షిప్స్ ఫీజు నెంబర్స్మెంట్స్ ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉ న్నటువంటి సమస్యలపై ఎస్ఎఫ్ఐ అనేక పోరాట నిర్వహిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ,ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, చింటూ,ఆఫ్సార్,సల్మాన్ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ కే సమాజ్ ఆధ్వర్యంలో నందు కు ఘన సన్మానం



**నారాయణపేట డిసెంబర్ 31:( స్కై న్యూస్)** నారాయణపేట ఎస్ ఎస్ కే సమాజ్ ఎంప్లాయిస్ సంఘం,,లైన్ వాడ యువజన సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది గా నియమితులైన నారాయణపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ముఖ్యంగా తమ వార్డుకు చెందిన సీనియర్ న్యాయవాది నందు నామాజీ సేవలు గుర్తించి కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది గా నియమించి నందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్రమోడీ కీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కే దక్కిన ఎంప్లాయిస్ అధ్యక్షుడు లక్ష్మన్ రావు,లైన్ వాడ యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ క్యాతన్ రఘునాథ్,హనుమంతరావు,తాటి కృష్ణ,గోపాల్ రావు సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**కొత్తగూడెం డిసెంబర్ 31 (స్కై న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి శాంతి, ఆరోగ్యం, సుఖసంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల పరిరక్షణకు పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ సమతుల్యంగా అమలయ్యేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం ఆశలు, ఆశయాలతో ముందుకు సాగే సంవత్సరం కావాలని కోరారు. ప్రజల మద్దతుతో సిపిఐ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని సాబీర్ పాషా స్పష్టం చేశారు.

# అద్భుత ప్రతిభతోనే శాంతి భద్రతలు

**నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ.**
**పెరిగిన నేరాల నమోదు.**
**తగ్గిన అత్యాచారాలు దొంగతనాలు.**
**జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్.**



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 31( స్కై న్యూస్)** జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూ నేరాలను తగ్గించేందుకు దుండగులను శిక్షించేందుకు అనుసరించిన అద్భుత ప్రతిభతోనే జిల్లా పోలీసు శాఖ ఎన్నో విజయాలు సాధించిందని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ వివరించారు బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంవత్సరిక శాఖ నివేదికను వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో అవగాహన కల్పించేందుకు పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమాల వల్ల ఇటీవల జిల్లాలో జరిగిన స్థానిక ఎన్నికలలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని వివరించారు. జిల్లాలో పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పనిచేస్తుందని వివరించారు జిల్లాలో 2024లో 4051 కేసులు నమోదు కాగా గత సంవత్సరం 418 కేసులు నమోదయాయని తెలిపారు. జిల్లాలో 2024లో 34 హత్యలు చోటు చేసుకోగా గత సంవత్సరం 28 హత్య కేసులు నమోదయాయని వివరించారు. 11% దొంగతనాలను నివారించడం జరిగిందని 2024లో 145 కేసులు నమోదు కాగా గత సంవత్సరం 129 కేసులు నమోదైనట్లు ఆయన వివరించారు. జిల్లాలో 50% అత్యాచార నేరాలను నియంతించడం జరిగిందని 2024 లో 109 కేసులు నమోదు కాగా 2025 లో 54 కేసులు నమోదయ్యాయని తెలిపారు రోడ్డు ప్రమాదాలు 8 శాతం తక్కువగా నమోదయ్యాయని 2024లో 190 కేసులు నమోదు కాగా 2025 లో 175 రోడ్డు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. అట్రాసిటీ కేసులను 36% తగ్గించడం జరిగిందని 2024 లో 89 కేసులు నమోదు కాగా 2025లో57 కేసులు నమోదయ్యాయని తెలిపారు. షీ టీం జిల్లాలో విత్రుతంగా అవగాహన కార్యక్రమాలు కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ మహిళలపై నేరాలు కూడా 20% తగ్గించడం జరిగిందని 2024లో 423 కేసులు నమోదు కాగా 2025లో 337 కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాలో అరికట్టేందుకు తనిఖీలు చేయగా 126 కేసులు నమోదు చేయడం జరిగిందని 240 మందిని అరెస్టు చేసి 148 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 1091 కిలోల గంజాయిని 26.22 గ్రాముల అల్పజోమ్ స్వాధీనం చేసుకొని 9 కేసులు నమోదు చేసి 32 మందిని అరెస్టు చేయడం జరిగిందని ఆయన వివరించారు. జిల్లాలో 2024లో 373 మంది అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా 2025లో 392 మంది మృతి చెందారని వివరించారు జిల్లాలో 238 ఆస్తి కేసులు నమోదు కావడం జరిగిందని 201 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆపరేషన్ మస్కాన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు నాగర్ కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాస్ కల్వకుర్తి డిఎస్పి వెంకటరెడ్డి అచ్చంపేట డిఎస్పి శ్రీనివాసులు ఎస్ బి సిఐ కనకయ్య డి సి ఐ బి సి ఐ ఉపేందర్ రావు ఆర్ఐలు జగన్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలుబొకేలు, శాలువాల బదులు విద్యార్థులకు ఉపయోగపడే సామగ్రి అందించాలి

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




**కొత్తగూడెం డిసెంబర్ 31 (స్కై న్యూస్ ):**జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధి తీసుకురావాలని, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి తనను కలెక్టర్ కార్యాలయానికి కలిసేందుకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు బొకేలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు తీసుకొని రావద్దని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా బొకేలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమేనని, అయితే వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర అవసరమైన సామగ్రిని అందించాలని ఆయన సూచించారు. ఈ విధంగా అందించే సామగ్రి పేద విద్యార్థుల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుందని,సేకరించిన విద్యా సామగ్రిని త్వరలో అర్హులైన విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం డిసెంబర్ 31 (స్కై న్యూస్ ):** కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి శాంతి, సుఖసంతోషాలు, ఆరోగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. గత సంవత్సరంలో ప్రజల సహకారంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్మికులు, రైతులు, యువత, మహిళలు అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ముందుకు వెళతానని, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ధ్యేయమని అన్నారు. ప్రజలు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. నూతన సంవత్సరం ఆశలు, అవకాశాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని కోరారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా సేవలందిస్తానని ఎమ్మెల్యే కూనంనేని స్పష్టం చేశారు

## పేటలో బాంబు డిస్పోజల్ టీం, పోలీస్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు



**నారాయణపేట డిసెంబర్ 31: (స్కైన్యూస్)**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బుధవారం టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డిసెంబర్ 31 సందర్భంగా బాంబు డిస్పోజల్ పోలీసు బృందంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అలాగే నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. డిసెంబర్ 31 సందర్భంగా గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గురించి, అక్రమ రవాణా జరగకుండా జిల్లా కేంద్రంలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించమని తెలిపారు. ముఖ్యంగా పార్సెల్ సర్వీసెస్ లో, కొరియర్ సెంటర్లలో, పాన్ షాప్ లలో, బస్టాండ్ లో, బార్స్, లాడ్జిలలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజలు, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేష్, హెడ్ కానిస్టేబుల్ బాలస్వామి పాల్గొన్నారు.

# సాంకేతిక యుగంలో ఆధ్యాత్మికత




మనిషి జీవితం కేవలం భౌతిక సౌకర్యాల సాధనకే పరిమితమైన యాంత్రిక ప్రయాణం కాదనే సత్యాన్ని గుర్తుచేసే దినమే వరల్డ్ స్పిరిట్యువల్ డే. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న ప్రపంచ వ్యాప్తంగా ఈ దినాన్ని ఆధ్యాత్మిక చైతన్య దినంగా గుర్తిస్తూ, అంతర్ముఖ పరిశీలనకు, మానవ విలువల పునరుద్ధరణకు పిలుపునిస్తారు. ఒక వైపు విజ్ఞానం, సాంకేతికత అద్భుతమైన వేగంతో ముందుకు సాగుతున్నా, మరోవైపు మనిషి అంతరంగంలో శాంతి కరువవు తుండటం, నైతిక విలువలు సడలి పోవడం, మానవ సంబంధాలు సంకుచిత మవడం వంటి పరిణామాలు తీవ్రంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యమే వరల్డ్ స్పిరిట్యువల్ డే ప్రాధాన్యతను మరింత పెంచుతోంది. ఆధ్యాత్మికత అనేది మతాచరణకే పరిమితమైన సంకుచిత భావన కాదు. అది మనసు, బుద్ధి, చైతన్యాల మధ్య సమన్వయ సాధన. స్వార్థాన్ని అధిగమించి విశాలమైన దృష్టితో జీవించటం, కరుణ, సహనం, సత్యం, అహింస, సేవ వంటి మానవీయ విలువ లను ఆచరణలో పెట్టడమే నిజమైన ఆధ్యాత్మికత. భగవద్గీతలో చెప్పిన కర్మయోగం, ఉపనిషత్తుల్లో ప్రతిపాదించిన ఆత్మజ్ఞానం, బుద్ధుని జ్ఞాన మార్గం, మహావీరుని అహింసా సిద్ధాంతయ ఇవన్నీ మనిషిని అంతర్ముఖంగా మలచే ఆధ్యాత్మిక మార్గాలే. ఇవి కాలాతీత సత్యాలుగా నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. నేటి ప్రపంచం యుద్ధాలు, ఉగ్రవాదం, హింస, సామాజిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం, పెరుగుతున్న మానసిక ఒత్తిడులతో అల్లాడుతోంది. ఈ సమస్యలకు చట్టాలు, పాలసీలు, సాంకేతిక పరిష్కారాలు అవసరమే అయినా, అవి మాత్రమే సరిపోవు. అసలు మార్పు మనిషిలో రావాలి. ఆ మార్పుకు మూలం ఆధ్యాత్మిక చైతన్యమే. వ్యక్తి తనలో తాను మారితేనే సమాజం మారుతుందిబీ సమాజం మారితేనే ప్రపంచం మారుతుంది. ఈ భావనను ప్రపంచ వ్యాప్తంగా అనేక ఆధ్యాత్మిక సంస్థలు, ధ్యాన కేంద్రాలు, ఆశ్రమాలు వరల్డ్ స్పిరిట్యువల్ డే సందర్భంగా ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నాయి. ఆధ్యాత్మికత శాస్త్రానికి వ్యతిరేకమన్న అపోహను ఆధునిక పరిశోధనలు పూర్తిగా తొలగించాయి. ధ్యానం, యోగ, మైండ్‌ఫుల్‌నెస్ వంటి సాధనల వల్ల ఒత్తిడి తగ్గడం, ఏకాగ్రత పెరగడం, భావోద్వేగ సమతుల్యత మెరుగు పడడం వంటి ప్రయోజనాలను శాస్త్రం స్పష్టంగా నిరూపిస్తోంది. మానసిక ఆరోగ్యానికి ఆధ్యాత్మిక సాధనలు ఎంతగానో దోహద పడుతున్నాయని వైద్య నిపుణులే చెబుతున్నారు. అంటే ఆధ్యాత్మికత శాస్త్రానికి విరుద్ధం కాదుబీ అది శాస్త్రాన్ని మరింత మానవీయంగా మలిచే శక్తిగా నిలుస్తోంది. భారతదేశం ఆధ్యాత్మిక వారసత్వానికి పుట్టినిల్లు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, భక్తి ఉద్యమం, యోగ సంప్రదాయయిఇవన్నీ ప్రపంచానికి భారతదేశం అందించిన అపూర్వమైన ఆధ్యాత్మిక కానుకలు. “వసుధైవ కుటుంబకం” అనే విశ్వ మానవతా సిద్ధాంతం నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైన మార్గదర్శక సూత్రం. జాతి, మతం, దేశ సరిహద్దులను దాటి మానవాళిని ఒక కుటుంబంగా చూడాలన్న ఈ దృష్టికోణం ప్రపంచ శాంతికి మూలాధారం. వరల్డ్ స్పిరిట్యువల్ డే సందర్భంలో భారతీయ ఆధ్యాత్మిక తత్త్వం ప్రపంచానికి మరింత అవసరమవు తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. యువత ఈ ఆధ్యాత్మిక చైతన్యంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ఆధ్యాత్మికత అంటే విరక్తి లేదా లోకత్యాగం కాదని, బాధ్యతతో కూడిన జీవన విధానమని యువత గ్రహించాలి. ఆధ్యాత్మిక విలువలను అలవరచుకున్న యువత వ్యక్తిగత విజయాన్ని మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా సమర్థంగా నిర్వహించ గలరు. సేవా కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాటయ ఇవన్నీ ఆధ్యాత్మికతకు ఆచరణాత్మక రూపాలే. వరల్డ్ స్పిరిట్యువల్ డేను ధ్యానం, యోగ సాధన, మౌనాచరణ, సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సాహిత్య పఠనం, మతాతీత సంభాషణలు, శాంతి సందేశాల ప్రచారం వంటి కార్యక్రమాలతో జరుపుకోవచ్చు. ఇవన్నీ మనిషిని తనలో తాను పరిశీలించుకునేలా చేస్తాయి, కొత్త సంవత్సరాన్ని ఆత్మ పరిశుద్ధితో ఆహ్వానించేందుకు దోహద పడతాయి. మొత్తానికి వరల్డ్ స్పిరిట్యువల్ డే ఒక స్మరణ మాత్రమే కాదుబక సంకల్పం. భౌతిక అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక పరిపక్వత సాధించినప్పుడే మానవజాతి నిజమైన పురోగతిని అందుకుంటుంది. వ్యక్తి అంతర్ముఖంగా శాంతిని పొందిన నాడే ప్రపంచం బాహ్యంగా శాంతిని పొందగలదు. ఆధ్యాత్మిక చైతన్యమే మానవాళి భవిష్యత్తుకు దీపశిఖగా నిలుస్తుంది.

### పెద్ద రాజమూర్ పాఠశాలలో

## నూతన సంవత్సర వేడుకలు



**దేవరకద్ర డిసెంబర్ 31 (స్కై న్యూస్);** ఎంపీ యుపిఎస్ పెద్ద రాజమూర్ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నూతన సంవత్సర వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి .కవిత, కె శంకర్ విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌనిక క్రాంతి రెడ్డి, ఎన్ఆర్ఐ అమెరికా వారి అభినందనలతో పంపిణీ చేసిన కేక్ ను ఉపాధ్యాయులు , విద్యార్థిని ,విద్యార్థుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా మౌనిక క్రాంతి రెడ్డి కి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ప్రత్యేక అభినందనలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు . ఆ తర్వాత విద్యార్థినీ విద్యార్థులకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025 సంవత్సరాన్ని ముగింపును తెలిజేస్తూ నూతన సంవత్సరంలో అందరికీ శుభం జరగాలని , ముఖ్యంగా విద్యార్థులకు మరొకసారి అడ్వాన్సుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి కవిత ,ఉపాధ్యాయుడు శంకర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**nmTv నాయకుల నిరసన..**



ధర్నా రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం 40 ఎమ్ ఎల్ డి వద్ద మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఎన్. సి. సి, కే. ఎస్ ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యాలు సకాలంలో మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నారు కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎన్.సీ.సీ, కె ఎస్ ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యాల లేబర్ లైసెన్సులు రద్దు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అంతారం నీటి శుద్ధి కేంద్రంలో 28 మందికి గాను కేవలం 15 మందితో పనులు చేయిస్తున్నారని వారిపై అధిక పని భారం పడిందని అన్నారు కార్మికులకు జీతాలు చెల్లించని పక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు

## దాతృత్వానికి ప్రతిరూపం బుడ్డా వెంగళరెడ్డి

కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాలోని ఉయ్యాలవాడ గ్రామం ఇరువురు విశిష్ట వ్యక్తులకు జన్మ స్థలంగా నిలిచింది. బ్రిటిషు వారి నెదిరించి 1846లో ఉరికంబ మెక్కిన ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఒకరైతే, 1900 సంవత్సరంలో తుది శ్వాస వరకూ మూర్తీభవించిన దాతృత్వంగా పేరొందిన బుడ్డా వెంగళరెడ్డి మరొకరు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారితో పోరాడి పేరు తెచ్చుకుంటే, ప్రభు త్వంతో సఖ్యతగా మెలుగుతూనే ప్రజలకు సేవ చేశాడు అదే ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బుడ్డా వెంగళరెడ్డి. తన దాతృ త్వంలో అప్పటి బ్రిటీష్ రాణి క్వీన్ విక్టోరియానే ఆకట్టుకున్న వ్యక్తి బుడ్డా వెంగళరెడ్డి. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని 'రేనాడు సూర్యుడు' అంటారు. బుడ్డ వెంగళ రెడ్డిని 'రేనాటి చంద్రుడు' అంటారు. సిపాయీల తిరుగుబాటుకు ముందే తెల్ల దొరల తలలు తెగిన అరివీర భయంకరుడు నరసింహారెడ్డి అయితే ఎముకలేని చేయి కలిగి అభినవ దానకర్ణుడు అని పేరెన్నికగన్నారు వెంగళ రెడ్డి. బుడ్డా వెంగళరెడ్డి (జనవరి 1, 1840 – డిసెంబరు 31, 1900) కర్నూలు జిల్లా, ఉయ్యాలవాడ గ్రామంలో సంపన్న రైతు కుటుం బంలో నల్లపురెడ్డి, వెంకటమ్మ దంపతులను జన్మించారు. పెద్దగా చదవక పోయినా తల్లినుండి దానగుణాన్ని, దాని గొప్పదనాన్ని గ్రహించారు. సంతానం కలుగ నందున తన తమ్ముని కుమారుని దత్తత తీసుకున్నారు. బాల్యం నుండే దానగుణం ఆయన వెంట నడిచింది. ఆపన్నులకు ఆసరా అందించడమే ఆయనకు నిత్య కృత్యంగా మారింది. కరవు బారిన పడిన పేదలకు తన ఆపన్న హస్తం చాచి కడుపు నిండా అన్నం పెట్టి కలియుగ దానకర్ణుడని పేరుపొందిన బుడ్డా వెంగళరెడ్డి. తనకు ఉన్నాదంతా దానం చేసిన మహానుభావుని దాతృత్వానికి పరాయి పాలకులు సైతం ఆశ్చర్య పోయారు. అందుకే విక్టోరియా మహారాణి ఆయన సేవలను గుర్తించి బంగారు పతకాన్ని బహుమానంగా ఇచ్చింది. బుడ్డ వెంగళరెడ్డి (1840 – 1900) 1866 కాలంలో సంభవించిన డొక్కల కరువు కాలంలో తన ఆస్తినంతా ధారపోసి ఎంతోమంది ప్రాణాల్ని కాపాడిన మహా దాత. పలు ప్రాంతాల నుండి తండోప తండాలుగా ఉయ్యాలవాడ చేరి రెడ్డిని ఆశ్రయించారు. వారి దీన స్థితిని అర్థంచేసుకున్న రెడ్డి ఇంట్లో ఉన్న ఆరు పుట్ల ధాన్యాన్ని గంజి కాయించి వేలాది కుటుంబాల ఆకలి తీర్చారు. పూటకు ఎనిమిది వేలకు తక్కువ కాకుండా ఈ కరవు కాలంలో బుడ్డ వెంగళరెడ్డి కరవు పీడితులైన ప్రజలకు మూడు నెలల పాటూ అన్న వస్త్రాలు ఇచ్చి కన్న తండ్రి లాగా కాపాడాడు. రాయల సీమలో పుట్టిన అపర దానకర్ణుడు వెంగళరెడ్డి. వంటమనిషి గంగన్న ఆకాలంలో చేసిన సేవలకు మెచ్చిన రెడ్డి అతనికొక బంగారు కడియం తొడిగి సత్కరించారు. అనంతర కాలంలో స్వగ్రామంలో పాఠశాలను నెలకొల్పి విద్యాదానం చేశారు. రెడ్డి సేవలను గుర్తించి విక్టోరియా బంగారు పతకాన్ని బహూక రించింది. ఢిల్లీలో 1877 జనవరి 1వ తేదీన జరిగిన సన్మాన సభలో బంగారు పతక బహూకరణ జరిగింది. ఆ బంగారు పతకముపై క్రింది విధంగా చెక్కబడింది. “1866వ సంవత్సరంలో సంభవిం చిన క్షామకాలమందు, నిరాధా రంగా నుండిన, తన స్వదేశస్థుల పట్ల జరిపించిన ఉత్కృష్ట ఔదార్యం నకు హర్ మైజెస్టి రాణిగారి వల్ల చేయబడిన శ్రేష్టమైన గణ్యతకు ఆనవాలుగా బుడ్డా వెంగళరెడ్డి గారికి బహుమాన మివ్వబడినది.



# నిద్రలేవగానే మానసిక గందరగోళం ఇలా ఎందుకు జరుగుతుంది?

పొద్దు పొద్దున్న బ్యాడ్ మూడ్‌తో నిద్రలేస్తున్నారా? ఏదో తెలియని నిరాశ, నిస్పృహ, మానసిక ఆందోళన, గందరగోళం వెంటాడుతున్నాయా?.. ఇలాంటి సమస్యకు కారణం మీరే కావచ్చునేమో ఒకసారి ఆలోచించండి. ఎందుకంటే.. ముందురోజు రాత్రి నిద్రకు ముందు మీరు తీసుకునే ఆహారం, పానీయాలు, అలాగే అతి ఆలోచనలు మరుసటిరోజు మిమ్మల్ని బ్యాడ్ మూడ్‌తో మేల్కొనేలా చేస్తాయంటున్నారు నిపుణులు. ఇటీవల అనేకమంది ఎదుర్కొంటున్న రొటీన్ ప్రాబ్లమ్ ఇది. నిద్ర మేల్కొన్నప్పటికీ ముఖంలో కోపం, ఆవేదన, స్ట్రెస్ వంటి ఏదో ఒక లక్షణం కనిపిస్తుంది. ఇలా అప్పుడప్పుడైతే పర్లేదు కానీ.. తరచూ అదే జరుగుతుంటే మాత్రం మీ ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాకుండా రోజువారి పనికి, వృత్తి జీవితానికి ఆటంకం కలుగుతుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు సరైన భోజనం తీసుకోకపోవడం మరుసటి రోజు ఉదయం మీరు బ్యాడ్‌గా నిద్రమేల్కొనేలా చేస్తుంది. కొందరికి రాత్రి భోజనం తర్వాత స్వీట్లు, చిప్స్, ఇతర చిరుతిళ్లు తినే అలవాటు ఉంటుంది. ఇలా తినడాన్ని ఇంట్లో వాళ్లు వ్యతిరేకిస్తారనే కారణంతో కొందరు ఎలాగైనా తినాలని సాకులు వెతుకుతుంటారు. తాము తిని చాలా రోజులైందని, కాబట్టి ఇప్పుడు తింటే ఏం కాదని చెప్తుంటారు. కొందరు అలా తినడంవల్ల తమ బాధలు పోతాయని, రిలాక్స్ అవుతామని అంటుంటారు. కానీ ఇది నిజం కాదు. రాత్రిళ్లు భోజనం తర్వాత అదనంగా ఆహారం, స్వీట్లు, చిప్స్, పిస్తా, పిజ్జా వంటివి తీసుకో కూడదని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే ఇవి అధిక మోతాదులో కార్బోహైడ్రేట్లు కలిగిన ఇతర ఆహారాలు. పడుకునే ముందు తినడంవల్ల నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. కానీ మరుసటిరోజు మీ మూడ్ పాడు చేస్తాయి. కోపంతో మేల్కొనేలా చేస్తాయి. న్యూట్రిషనల్ థెరపిస్ట్ జాకీ లించ్ ప్రకారం.. ఇలాంటి ఆహారాలు మీ రక్తంలో షుగర్ లెవల్స్‌ను హెచ్చుతగ్గులకు గురిచేస్తాయి. ఫైనల్‌గా నిద్రపోయే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే నిద్ర పోయేకంటే ముందు కనీసం 3 నుంచి 4 గంటల ముందు తింటే అంత ప్రభావం ఉండకపోవచ్చు. మీరు బ్యాడ్ మూడ్‌లో మేల్కొన్నప్పుడు, ఆ కోపాన్ని మీ కడుపుపై చూపొద్దు. అంటే బ్రేక్ ఫాస్ట్ తీసుకోకుండా ఉండకండి. మీరు ఏ విధమైన ఆహారం తీసుకున్నా సరే.. బ్రేక్ ఫాస్ట్ అనేది చాలా ముఖ్యం. మూడ్ బాగోలేదని దానిని స్కిప్ చేస్తుంటే గనుక మీరు నిరాశ, ఆందోళనలను ఆహ్వానించినట్టే లెక్క. లైట్ అండ్ హెల్తీ బ్రేక్‌ఫాస్ట్ తక్షణమే మీ రోజువారి మానసిక స్థితిని ఆనందమయం చేస్తుంది. మీకు కోపంగా అనిపించినప్పుడు ఎందుకలా అనిపిస్తుందనేది నిర్ధారించుకోండి. కొంచెం అల్పాహారం తినండి, ఆ తర్వాత ఎలా అనిపిస్తుందో చూడండి. తినకుండా ఉండటం అనేది మరుసటిరోజు మీ మూడ్ పాడవడానికి కారణం అవుతుంది. ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ చేసేందుకు ట్రై చేసినవారు ఆరోజంతా చాలా మంచి అనుభూతి చెందుతారు. బోనస్ చిట్కా ఏటంటే.. మీరు తీసుకునే బ్రేక్ ఫాస్ట్‌లో తగిన ప్రోటీన్‌ను కలిగి ఉండటం. ఎందుకంటే ఇది బరువు తగ్గడానికి, ఎనర్జీ కోసం సహాయపడుతుంది. మీరెప్పుడైనా నిద్రలేని రాత్రులు గడిపారా? ఎలాగైనా నిద్రపోవాలని ప్రయత్నంలో భాగంగా కళ్లు మూసుకుంటారు. కానీ కునుకు రాదు. రకరకాల ఆలోచనలు వెంటాడుతుంటాయి. అయితే ఎందుకు అలా జరుగుతుందో మాత్రం చాలామంది పట్టించుకోరు. మీరు మరుసటి రోజు బ్యాడ్ మూడ్‌తో నిద్ర మేల్కొనడానికి ఇది కూడా ఒక కారణమే అంటున్నారు నిపుణులు. పడుకునే ముందు రోటీన్‌కు భిన్నమైన జీవనశైలి, ఎక్కువసేపు స్క్రీన్ చూడటం, ఫోన్‌లో నిమగ్నమైపోవడం, జంక్ లేదా ఆయిలీ ఫుడ్స్ తినడం వంటి కారణాలతో ఇటువంటి సమస్య తలెత్తుతుంది. కాబట్టి వాటిని నివారించాలి. నిద్రపోయే సమయాన్ని ఆందోళన కరంగా ఉండకుండా చూసుకోవాలి. ప్రశాంతమైన వాతావరణం క్రియేట్ చేసుకోవాలి అంటున్నారు నిపుణులు.

# 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలుతుందా?



వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు. వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు జుట్టు రాలుతుంది? అనే విషయాల గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? మాక్స్ హాస్పిటల్‌లోని డెర్మటాలజీ విభాగంకి చెందిన డాక్టర్ సౌమ్య సచ్‌దేవా దీని గురించి మాట్లాడుతూ.. 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉన్నాయి. కొంతమంది మహిళలు ఈ వయసులో మెనోపాజ్‌కు గురవుతారు. ఇది కూడా ఒక కారణం. అంతేకాకుండా అనేక హార్మోన్ల లోపాలు కూడా దీనికి కారణం కావచ్చు. మహిళలకు ఐరన్, విటమిన్ డి, బయోటిన్ లోపం ఉన్నా జుట్టు రాలడం సంభవించవచ్చు. మహిళల్లో జుట్టు రాలడానికి మానసిక ఒత్తిడి కూడా ఒక ప్రధాన కారణమని డాక్టర్ సౌమ్య అంటున్నారు. ఇటీవలి సంవత్సరాలలో మానసిక ఒత్తిడి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి జుట్టును కూడా ప్రభావితం చేస్తాయి. జుట్టు పెరుగుదలను అడ్డుకుంటాయి. జుట్టు రాలడానికి కారణమవుతాయి. కొన్ని సందర్భాల్లో, ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా జుట్టు రాలడానికి కారణమవుతాయి. ఈ వ్యాధులకు చికిత్స లేదు. కొంతమంది మహిళల్లో థైరాయిడ్ లేదా డయాబెటిస్ వల్ల కూడా జుట్టు రాలడం సంభవించవచ్చు. ఇలాంటి సందర్భాలలో థైరాయిడ్, డయాబెటిస్‌ను నియంత్రించడం వల్ల కూడా జుట్టు రాలడాన్ని నియంత్రించవచ్చు. మహిళకు ఆటో ఇమ్యూన్ వ్యాధి లేదా జన్యుపరమైన కారణాల వల్ల జుట్టు రాలడం జరిగితే దానిని పూర్తిగా నియంత్రించడం కష్టం. ఇతర సందర్భాల్లో కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ప్రోటీన్, ఐరన్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.జుట్టు పెరుగుదలకు పుట్టగొడుగులు వంటి విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాన్ని తినాలి.నీళ్లు పుష్కలంగా తాగాలి. మానసిక ఒత్తిడిని నివారించాలి. దానిని నివారించడానికి ప్రతిరోజూ యోగా సాధన చేయాలి.మీ తలకు క్రమం తప్పకుండా మసాజ్ చేసుకోవాలి.

# మెదడు చురుగ్గా పనిచేయాలంటే...



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది పిల్లలు అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండటం, ఉదయం ఆలస్యంగా నిద్ర లేవటం అలవాటు చేసుకుంటున్నారు. ఇలాంటి అస్తవ్యస్తమైన నిద్ర వేళల వల్ల పిల్లల శారీరక ఎదుగుదలపై ప్రభావం పడటమే కాకుండా, వారిలో చికాకు కూడా పెరుగుతుంది. అందుకే ప్రతిరోజూ పిల్లలు ఒకే నిర్ణీత సమయానికి నిద్రపోయేలా, మళ్ళీ ఉదయాన్నే ఒకే సమయానికి నిద్రలేచేలా క్రమశిక్షణ అలవాటు చేయాలి. క్రమం తప్పకుండా ఒకే వేళకు నిద్రపోవడం వల్ల శరీరంలోని జీవక్రియలు సక్రమంగా పనిచేస్తాయి. రాత్రిపూట తగినంత సమయం గాఢ నిద్రపోవడం వల్ల పిల్లల మెదడు ఎంతో చురుకుగా మారుతుంది. సరైన నిద్ర ఉన్నప్పుడే వారు పగటిపూట చదువుల్లో మరియు ఇతర ఆటపాటల్లో ఏకాగ్రతను ప్రదర్శించగలుగుతారు. నిద్రలో మెదడు కణాలు పునరుజ్జీవనం పొందుతాయి, ఇది వారి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుంది. కాబట్టి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం నిద్ర విషయంలో అస్సలు రాజీ పడకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నేటి కాలంలో పిల్లలు నిద్రపోవడానికి ముందు టీవీ చూడటం లేదా మొబైల్ ఫోన్‌లలో గేమ్స్ ఆడటం వ్యసనంగా మార్చుకుంటున్నారు. ఈ అలవాటు వారి కళ్ళపై ఒత్తిడి పెంచడమే కాకుండా, మెదడును ఉత్తేజితం చేసి నిద్ర రాకుండా చేస్తుంది. అందుకే పడుకునే కనీసం గంట ముందు నుంచి డిజిటల్ పరికరాలకు వారిని దూరంగా ఉంచాలి. వాటికి బదులుగా పిల్లలకు ఆసక్తి కలిగించే నీతి కథలు లేదా జందమామ కథలు చెప్పడం ద్వారా వారు మానసిక ప్రశాంతత పొంది త్వరగా నిద్రలోకి జారుకుంటారు. పిల్లలు హాయిగా నిద్రపోవాలంటే వారు పడుకునే గది వాతావరణం కూడా ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. నిద్రపుచ్చే సమయంలో గదిలో వెలుతురు తక్కువగా ఉంటూ, ప్రశాంతమైన వాతావరణం ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. గదిలో ఎక్కువ శబ్దాలు లేకుండా నిశ్శబ్దంగా ఉంటే పిల్లలు ఎటువంటి ఆటంకం లేకుండా గాఢ నిద్రపోతారు. ఆహ్లాదకరమైన వాతావరణం మరియు తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉంటే పిల్లల నిద్ర అలవాట్లు మెరుగుపడి వారు ఆరోగ్యంగా పెరుగుతారు.

# హనీమూన్ పాత మోడల్.. ఇప్పుడు నడుస్తోంది 'మినిమూన్' ట్రెండ్!



పెళ్లి అనగానే మనకు గుర్తొచ్చేది బంధుమిత్రుల సందడి, భోజనాలు, ఫోటో షూట్‌లు. వీటన్నింటి తర్వాత కొత్త జంట ఎంతో ఆశగా ఎదురుచూసేది హనీమూన్ కోసం. ఒకప్పుడు హనీమూన్ అంటే కనీసం వారం పది రోజుల పాటు విదేశాలకో లేదా సుదూర ప్రాంతాలకో వెళ్లడం ఆచారంగా . పెళ్లి అనగానే మనకు గుర్తొచ్చేది బంధుమిత్రుల సందడి, భోజనాలు, ఫోటో షూట్‌లు. వీటన్నింటి తర్వాత కొత్త జంట ఎంతో ఆశగా ఎదురుచూసేది హనీమూన్ కోసం. ఒకప్పుడు హనీమూన్ అంటే కనీసం వారం పది రోజుల పాటు విదేశాలకో లేదా సుదూర ప్రాంతాలకో వెళ్లడం ఆచారంగా ఉండేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. నేటి తరం జంటలు సుదీర్ఘమైన హనీమూన్ కంటే 'మినిమూన్' వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అసలు ఈ మినిమూన్ అంటే ఏంటి? దీనికి ఎందుకంత క్రేజ్ పెరుగుతోంది?

మినిమూన్ అంటే పెళ్లి అయిన వెంటనే కేవలం రెండు లేదా మూడు రోజుల పాటు దగ్గర్లోని ఏదైనా ప్రశాంతమైన ప్రదేశానికి వెళ్లడం. అంటే ఒక లాంగ్ వీకెండ్ ట్రిప్ లాంటిదన్నమాట. భారీ హనీమూన్ ప్లాన్‌ను భవిష్యత్తు కోసం వాయిదా వేసి, ప్రస్తుతానికి పెళ్లి అలసట నుంచి ఉపశమనం పొందేందుకు ఈ చిన్న ప్రయాణాలను ఎంచుకుంటున్నారు. ఇది కేవలం మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఒక పాపులర్ ట్రెండ్‌గా మారుతోంది. కొత్త జంటలు మినిమూన్ వైపు వెళ్లడానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి.మొదటిది సమయం, పెళ్లి పనుల కోసం ఇప్పటికే ఆఫీసుల నుంచి చాలా రోజులు సెలవులు తీసుకుంటారు. మళ్ళీ హనీమూన్ కోసం రెండు వారాల సెలవు దొరకడం కష్టమవుతోంది. అందుకే పెళ్లి తర్వాత దొరికిన రెండు రోజుల్లోనే ఒక చిన్న ట్రిప్ వేస్తున్నారు. రెండవది బడ్జెట్, పెళ్లి ఖర్చుల వల్ల ఆర్థికంగా కొంత భారం పడవచ్చు.అలాంటి సమయంలో ఖరీదైన అంతర్జాతీయ హనీమూన్ కంటే తక్కువ ఖర్చుతో అయ్యే మినిమూన్ బెస్ట్ ఆప్షన్ అని భావిస్తున్నారు. మూడవది రిలాక్సేషన్, పెళ్లి హడావుడిలో కొత్త జంట విపరీతంగా అలసిపోతారు. ఆ సమయంలో సుదూర ప్రయాణాలు చేయడం కంటే దగ్గర్లోని రిసార్ట్‌లో ప్రశాంతంగా గడపడం వారికి నచ్చుతోంది. మినిమూన్ వెళ్లేవారు హనీమూన్ క్యాన్సిల్ చేసుకుంటారని కాదు. పెళ్లి తర్వాత వెంటనే ఒక చిన్న ట్రిప్ వేసి, ఆ తర్వాత ఆరు నెలలకు లేదా ఏడాదికి ఒకసారి తీరిక చూసుకుని పెద్ద హనీమూన్‌కు వెళ్తున్నారు. దీనిని 'మెగా మూన్' అని పిలుస్తున్నారు. దీనివల్ల ఆర్థికంగా ప్లాన్ చేసుకోవడానికి, సెలవులు సర్దుబాటు చేసుకోవడానికి వీలుంటుంది. ముఖ్యంగా ఈ మినిమూన్ కోసం విలాసవంతమైన హోటళ్లు, స్టేకేషన్లు, ప్రైవేట్ విల్లాలను జంటలు ఇష్టపడుతున్నారు. మొత్తానికి హనీమూన్ అంటే కేవలం తిరగడం మాత్రమే కాదు, ఇద్దరి మధ్య బంధాన్ని బలోపేతం చేసుకోవడమే అసలు ఉద్దేశం. అది పది రోజుల ట్రిప్ అయినా లేదా రెండు రోజుల మినిమూన్ అయినా.. ఆ క్షణాలను ఎలా ఎంజాయ్ చేస్తున్నామన్నదే ముఖ్యం!

## బిజినెస్

### జెప్టో రూ.11వేల కోట్ల ఐపీఓ.. సెబికి పత్రాలు




క్విక్ కామర్స్ దిగ్గజం జెప్టో ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూకి సంబంధించిన ముసాయిదా పత్రాలను కాన్ఫిడెన్షియల్ విధానంలో మార్కెట్ల నియంత్రణ సంస్థకు సమర్పించింది. దీని ప్రకారం కంపెనీ సుమారు రూ. 11,000 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాదిలో కంపెనీ లిస్టయ్యే అవకాశం ఉంది. ఒకవేళ ఈ ఐపీవో సజావుగా సాగితే కార్యకలాపాలు ప్రారంభించిన అత్యంత తక్కువ వ్యవధిలోనే లిస్టయిన యువ అంకుర సంస్థగా జెప్టో నిలుస్తుంది. అలాగే పోటీ సంస్థలు జొమాటో, స్విగ్గీ సరసన కూడా చోటు దక్కించుకుంటుంది. 10 నిమిషాల్లో డెలివరీ సర్వీసుల పేరిట ప్రారంభమైన జెప్టో 7 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ఇప్పటివరకు ఇన్వెస్టర్ల నుంచి రూ. 16,000 కోట్లు సమీకరించింది. 2023 ఆగస్టులో 200 మిలియన్ డాలర్ల సమీకరణ ద్వారా యూనికార్న్ (బిలియన్ డాలర్ల కంపెనీ) హోదా దక్కించుకుంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ డ్రాప్‌అవుట్స్ అయిన ఆదిత్ పలిచా, కైవల్య వోహ్రా కలిసి దీన్ని నెలకొల్పారు. 2025 సెప్టెంబర్ నాటికి కంపెనీకి 900 డార్క్ స్టోర్స్ ఉన్నాయి.

# డిజిటలైజేషన్‌లో యూటర్న్!

## ఆన్‌లైన్‌లో కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు అప్రమత్తం

**న్యూఢిల్లీ :** కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు డిజిటలైజేషన్ కంటే సంప్రదాయ పద్ధతులకే మొగ్గు చూపుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ ఖాతాలను తెరువాలని కోరుకునే కస్టమర్ల కోసం బడా బ్యాంకు లు ఇప్పుడు భౌతిక పరిశీలనలకే ఆసక్తి కనబరుస్తున్నాయి మరి. మ్యూల్ అకౌంట్లు, మోసాల నేపథ్యంలో కస్టమర్ల ఇంటికే రిలేషన్‌షిప్ మేనేజర్లు వెళ్లి పనిని పూర్తిచేస్తున్నారు. లేకపోతే కస్టమర్లను సమీప బ్యాంక్ శాఖలకు రావాలని బ్యాంక్ వర్గాలు కోరుతున్నాయి.

**బడా బ్యాంకుల్లో..**

ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియాలు తమ ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ వ్యవస్థల్ని పక్కనపెట్టినట్టు తెలుస్తున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ తమ ఇన్‌స్టా-అకౌంట్ ఓపెనింగ్ సర్వీస్‌ను ఆపేసిందని సమాచారం. కేవలం సాలరీ ఖాతాలకే డిజిటల్ ప్రక్రియను వినియోగిస్తున్నట్టు చెప్తున్నారు. మిగతా ఖాతాలను ఆశించే కస్టమర్లు డాక్యుమెంట్స్ సమర్పణకు సమీప బ్యాంక్ శాఖకు వెళ్లాలని బ్యాంక్ అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనకు కస్టమర్ల ఇండ్లకే బ్యాంక్ అధికారులూ వెళ్తున్నారని బ్యాంక్ వర్గాలు చెప్తున్నాయి. పైగా పెరుగుతున్న మోసాలకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించకపోవడమేనంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బ్యాంకులపై జరిమానాలనూ వేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఫైన్ల నుంచీ తప్పించుకున్నట్టు అవుతుందని చాలా బ్యాంకులు భౌతిక పరిశీలనలకే జై కొడుతున్నాయి.

**మ్యూల్ ఖాతాల సెగ**

అమాయక ఖాతాదారులను ఏమార్చి నేరగాళ్లు.. తమ అక్రమ కార్యకలాపాల నుంచి ఆర్జించిన సొమ్మును పొందడానికి,



బదిలీ చేయడానికి వారి బ్యాంక్ ఖాతాలను వాడుకుంటూ ఉంటారు. మనకు తెలియకుండానే మోసపూరితంగా మన డాక్యుమెంట్లను వాడుకుని బ్యాంకుల్లో మన పేరిట ఖాతాలనూ తెరుస్తారు. వీటినే మ్యూల్ అకౌంట్స్ అంటారు. అయితే ఈ వ్యవహారాన్ని బ్యాంకులు గుర్తిస్తే సదరు ఖాతాలు మూతబడిపోతాయి. అంతేగాక దీంతో ప్రమేయంలేని అమాయకులు సమస్యల్లో పడుతారు. భవిష్యత్తులో వారికి బ్యాంకింగ్ లావాదేవీలు కష్టతరంగా మారుతాయి. ఇక ఇటీవలికాలంలో ఈ మ్యూల్ అకౌంట్స్ పెరిగిపోతున్నాయి. గత ఏడాది పెద్దపెద్ద బ్యాంకుల్లో మోసపూరిత నగదు లావాదేవీలు భారీగానే జరిగినట్టు గుర్తించారు. అందుకే ఆన్‌లైన్ అకౌంట్ ఆన్‌బోర్డింగ్ సర్వీసు నిబంధనల్ని కఠినతరం చేస్తున్నామని బ్యాంక్ సిబ్బంది అంటున్నారు. డిజిటల్ బ్యాంకింగ్ మార్గాల ద్వారా నకిలీ డాక్యుమెంట్లతో ఖాతాలు తెరుస్తున్న వైనాన్ని అడ్డుకునే దిశగా బ్యాంకులు వెళ్తున్నాయని, అందుకే కస్టమర్లను నేరుగా సంప్రదించాకే ఖాతాలను తెరుస్తున్నాయని ఓ ఫ్రాడ్ డిటెక్షన్ స్టార్టప్ వ్యవస్థాపకుడు తెలిపారు.

**బ్యాంకర్ల మాటేంటి?**

మ్యూల్ ఖాతాలను గుర్తించి సకాలంలో వాటిని మూసేయకపోతే ఆర్బీఐ జరిమానా వేస్తున్నదని బ్యాంకర్లు చెప్తున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో ఖాతాల కోసం వచ్చిన దరఖాస్తులపట్ల అప్రమత్తంగా ఉంటున్నామని పేర్కొంటున్నారు. అయినప్పటికీ కొత్త ఖాతాలకు డిజిటలైజేషన్ ఎంతో ముఖ్యమని కూడా వివరిస్తున్నారు. కాబట్టి కస్టమర్లను నేరుగా కలిసేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాన బ్యాంక్‌లోని ఓ ఉన్నతోద్యోగి తెలిపారు. ఇక ఖాతాదారులకు ఈ మోసాల గురించి అవగాహన కల్పిస్తున్నాయి బ్యాంకులు. కార్డ్ నెంబర్లు, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీలు ఎవ్వరికీ చెప్పరాదని సూచిస్తున్నాయి.

**ఇదీ సంగతి..**

కేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలో ఆన్‌లైన్ ప్రాధాన్యత పెరిగిపోయింది. అన్నీ ఆన్‌లైన్‌లోనే అన్నట్టు తయారైంది. ఇక పాత పెద్ద నోట్ల రద్దుతో డిజిటల్ పేమెంట్స్ ఊపందుకున్నాయి. కానీ ఇదే సమయంలో బ్యాంక్ మోసాలు కూడా భారీగానే పెరుగడం గమనార్హం. అందరి చేతికి స్మార్ట్‌ఫోన్లు రావడంతో ఇంటర్నెట్ అంతటా విస్తరించింది. 4జీ, 5జీ సేవలు మొదలవడంతో ఇటీవలికాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వాడకం సైతం పుంజుకున్నది. ఈ నేపథ్యంలో సైబర్ మోసగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో బ్యాంకులు అప్రమత్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే పాత సంప్రదాయ పద్ధతులే సురక్షితం అన్న అభిప్రాయానికి వచ్చేస్తున్నారు. అందుకే తమ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రాసెస్‌లోకి ఫిజికల్ చెక్స్ (భౌతికంగా పరిశీలనలు)ను పరిచయం చేస్తున్నారు.

# కొత్త ఏడాదిలో.. ఫిన్‌టెక్ ఐపీవోల జోరు

వచ్చే ఏడాది కూడా పబ్లిక్ ఇష్యూల జోరు కొనసాగనుంది. కొత్త సంవత్సరంలో సుమారు పది దిగ్గజ ఫిన్‌టెక్ కంపెనీలు సైతం లిస్టింగ్‌పై కసరత్తు చేస్తున్నాయి. ఫోన్‌పే, రేజర్‌పే, పేయూ, అయ్ ఫైనాన్స్, ఇన్‌క్రెడ్ హోల్డింగ్స్, ఇన్నోవిటీ, పేనియర్‌బై తదితర సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫాంలు ఎకో, టర్టిల్‌మింట్, ట్రావెల్ బ్యాంకింగ్ సంస్థ నియోలాంటివి కూడా ఐపీవో సన్నాహాల్లో ఉన్నాయి. వీటిలో కొన్ని కంపెనీలు ఇప్పటికే ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించగా, మరికొన్ని సంస్థలు బ్యాంకర్లను నియమించుకునే పనిలో ఉన్నాయి.

ఇంకొన్ని తమ లిస్టింగ్ ప్రణాళికలను ప్రకటించాయి. అయ్ ఫైనాన్స్, టర్టిల్‌మింట్ సంస్థలకు నియంత్రణ సంస్థ అనుమతి కూడా లభించింది. అయ్ ఫైనాన్స్ దాదాపు రూ. 1,450 కోట్లు సమీకరించనుంది. ఇందులో రూ. 885 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ విధానంలో మరిన్ని షేర్లను కంపెనీ విక్రయించనుంది. ఇక రుణాలు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు సాగించే ఇన్‌క్రెడ్ హోల్డింగ్స్ కూడా తమ ఐపీవో పత్రాలను సెబీకి సమర్పించింది. వీటి ప్రకారం కంపెనీ దాదాపు రూ. 3,000%-%4,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఫోన్‌పే కూడా ముసాయిదా పత్రాలను నియంత్రణ సంస్థకు సమర్పించినట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది. డీల్ వివరాలను వెల్లడించనప్పటికీ, దాదాపు రూ. 12,000 కోట్లు సమీకరించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో ఉంటుందని సమాచారం. వచ్చే ఏడాది రాబోయే అతి పెద్ద ఐపీవోల్లో ఇది కూడా ఒకటి కానుంది. దీనితో టైగర్ గ్లోబల్, జనరల్ అట్లాంటిక్, రిబిట్ క్యాపిటల్, టీవీఎస్ క్యాపిటల్‌లాంటి ప్రారంభ దశ ఇన్వెస్టర్లు నిష్క్రమించేందుకు అవకాశం లభిస్తుంది. అటు ఇన్నోవిటి, పేయూ, పేనియర్‌బై, నియో సంస్థల మేనేజ్‌మెంట్లు కూడా తమ లిస్టింగ్ ప్రణాళికలను ధృవీకరించాయి. అయితే, ఇంకా ముసాయిదా పత్రాలను సమర్పించాల్సి ఉంది. ఎకో సంస్థ 2026%-%27లో లిస్టింగ్ ద్వారా 300%-%400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 2,700 కోట్లు %-% రూ. 3,600 కోట్ల వరకు) సమీకరించే దిశగా బ్యాంకర్లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

**స్టార్టప్‌లలో పెట్టుబడుల వెల్లువ ..**

గత రెండేళ్లుగా అంకుర సంస్థల్లోకి స్థిరంగా పెట్టుబడులు వస్తున్నాయ. అత్యధికంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్న సంస్థల్లో ఈ%-%కామర్స్ తర్వాత ఫిన్‌టెక్ కంపెనీలు రెండో స్థానంలో ఉన్నాయ. పరిశ్రమ డేటా ప్రకారం 2025లో ఫిన్‌టెక్ కంపెనీలు 120 డీల్స్ ద్వారా 1.87 బిలియన్ డాలర్ల పైగా నిధులను సమీకరించాయి. 2024లో 140 డీల్స్ ద్వారా 1.61 బిలియన్ డాలర్లు సేకరించాయి.

వ్యాపారాన్ని విస్తరిస్తూ, నష్టాలను తగ్గించుకుంటూ ఉండటం ద్వారా పలు ఫిన్‌టెక్ కంపెనీలు క్రమంగా లాభాల బాట పడుతున్నాయి. దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలు వేసుకుంటున్నాయి.




ఈ నేపథ్యంలో గ్రో, పైన్ ల్యాబ్స్, మొబిక్విక్‌లాంటి కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు ఇన్వెస్టర్ల నుంచి సానుకూల స్పందన లభించింది. దీంతో మరిన్ని కంపెనీలు కూడా లిస్టింగ్ బాట పడుతున్నాయి. ఇక ఫిన్‌టెక్‌లే కాకుండా 2026లో వివిధ విభాగాలకు చెందిన అంకురాలు కూడా పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. ఫ్లిప్‌కార్ట్, ఓయో, రెంటోమోజో, బోట్, క్యూర్‌ఫుడ్స్, జెట్‌వెర్క్, షిప్‌రాకెట్, షాడోఫ్యాక్స్ మొదలైనవి ఈ లిస్టులో ఉన్నాయి.

# మ్యాక్స్‌వెల్ ఖాతాలో అరుదైన సిక్సర్ల రికార్డు

ఆసీస్ విధ్వంసకర వీరుడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో అరుదైన మైలురాయిని తాకాడు. 2025-26 ఎడిషన్‌లో భాగంగా ఇవాళ (డిసెంబర్ 28) సిడ్నీ థండర్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన అతను.. బీబీఎల్ కెరీర్‌లో 150 సిక్సర్ల మార్కును దాటాడు. ఈ మ్యాచ్‌లో 2 సిక్సర్లు బాదిన మ్యాక్సీ బీబీఎల్‌లో తన సిక్సర్ల సంఖ్యను 151కి పెంచుకున్నాడు. తద్వారా లీగ్ చరిత్రలో 150 సిక్సర్ల మార్కును తాకిన రెండో బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. మ్యాక్సీకి ముందు క్రిస్ లిన్ మాత్రమే 150 సిక్సర్ల మార్కును తాకాడు. లిన్ ఖాతాలో ప్రస్తుతం 220 సిక్సర్లు ఉన్నాయి. బీబీఎల్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల టాప్-5 జాబితాలో లిన్, మ్యాక్సీ తర్వాతి స్థానాల్లో బెన్ మెక్‌డెర్మాట్ (140), ఆరోన్ ఫించ్ (118), మార్కస్ స్టోయినిస్ (111) ఉన్నారు. మ్యాచ్ విషయానికొస్తే.. సిడ్నీ థండర్‌పై మ్యాక్స్‌వెల్ ప్రాతినిథ్యం వహిస్తున్న మెల్‌బోర్న్ స్టార్స్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన థండర్.. హరీస్ రౌఫ్ (4-0-29-3), టామ్ కర్రన్ (4-0-22-2), స్టోయినిస్ (3-0-25-2), మిచెల్ స్వెప్సన్ (4-0-18-2), పీటర్ సిడిల్ (4-0-22-1) దెబ్బకు 20 ఓవర్లు బ్యాటింగ్ చేసి 128 పరుగులకు ఆలౌటైంది. థండర్ ఇన్నింగ్స్‌లో షాదాబ్ ఖాన్ (25) టాప్ స్కోరర్ కాగా.. మాథ్యూ గిల్క్స్ (24), సామ్ బిల్లింగ్స్ (23) మాత్రమే 20కి పైగా స్కోర్లు చేశారు. మిగతా ఆటగాళ్లలో కొన్‌స్టాస్ 11, డేవిడ్ వార్నర్ 10, బాన్‌క్రాఫ్ట్ 10, డేనియల్ సామ్స్ 3, క్రిస్ గ్రీన్ 1, తన్వీర్ సంఘా 1, ర్యాన్ హ్యాడ్లీ 1 పరుగు చేశారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని మెల్‌బోర్న్ ఒకే వికెట్ కోల్పోయి 14 ఓవర్లలోనే ఛేదించింది. జో క్లార్క్ (37 బంతుల్లో 60బీ 8 ఫోర్లు, సిక్స్) మెరుపు అర్ధ సెంచరీతో మెల్‌బోర్న్‌ను గెలుపు వాకిటి వరకు తీసుకెళ్లాడు. అనంతరం సామ్ హార్పర్ (29 నాటౌట్), మ్యాక్స్‌వెల్ (39 నాటౌట్‌బీ 5 ఫోర్లు, 2 సిక్సర్లు) మిగతా కార్యక్రమాన్ని పూర్తి చేశారు.




# హాకీ ఇండియా లీగ్‌కు వేళాయే..

మహిళల హాకీ ఇండియా లీగ్ రెండో సీజన్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొన్ని నిమిషాల్లో రాంచీ వేదికగా ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అయితే.. తొలి సీజన్ ఛాంపియన్ ఒడిశా వారియర్స్ ఈసారి బరిలోకి దిగడం లేదు. ఈ జట్టు స్థానంలో రాంచీ రాయల్స్ ఆడనుంది. దాంతో.. ఇప్పుడు కూడా నాలుగు జట్లు ట్రోఫీకోసం నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్, జేఎస్‌డబ్ల్యూ సూర్మ హాకీ క్లబ్, శ్రచి బెంగాల్ టైగర్స్ జట్లు టైటిల్ వేటకు సిద్ధంగా ఉన్నాయి. రాంచీ వేదికగా మహిళల హాకీ ఇండియా లీగ్ రెండో సీజన్ రోజు (డిసెంబర్ 28) రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. ఆరంభ పోరులో రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్ జట్లు తలపడనున్నాయి. నాలుగు జట్లు ఒక్కోటి మరో జట్టుతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతాయి. అనంతరం టాప్ -2 జట్ల మధ్య టైటిల్ పోరు జరుగుతుంది. జనవరి 10న జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీ ముగుస్తుంది.



## స్పోర్ట్స్

### గౌతమ్ గంభీర్‌పై వేటు..

### తుది నిర్ణయం ప్రకటించిన బీసీసీఐ



టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ ప్రయాణం మిశ్రమ ఫలితాలతో కూడుకొని ఉంది. అతని మార్గదర్శకత్వంలో భారత జట్టు పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో అదరగొడుతున్నా.. టెస్ట్‌ల్లో మాత్రం తేలిపోతుంది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో క్లీన్ స్వీప్‌తో (0-3)మొదలైన గంభీర్ టెస్ట్ ప్రస్తానం (టీమిండియా హెడ్ కోచ్‌గా).. తాజాగా స్వదేశంలోనే సౌతాఫ్రికా చేతిలో క్లీన్ స్వీప్ (0-2) వరకు సాగింది. ఈ మధ్యలో గంభీర్ మార్గదర్శకత్వంలో భారత జట్టు ఒక్క విండీస్‌పై మాత్రమే సానుకూల ఫలితం (2-0) సాధించింది. దీనికి ముందు ఆసీస్ పర్యటనలో 1-3తో సిరీస్ కోల్పోయి, ఇంగ్లండ్ పర్యటనలో డ్రాతో (2-2) గట్టెక్కింది. టెస్ట్‌ల్లో పేలవ ట్రాక్ రికార్డు కలిగి ఉండటంతో పాటు అనునిత్యం వివాదాలతో సావాసం చేసే గంభీర్‌ను టెస్ట్ జట్టు హెడ్ కోచ్ విధుల నుంచి తప్పించాలని సర్వత్రా డిమాండ్లు వినిపిస్తున్నాయి. త్వరలో గంభీర్‌పై వేటు ఖాయమని గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.

గంభీర్ స్థానంలో భారత టెస్ట్ జట్టు హెడ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ ఎంపిక ఖరారైందని పలు జాతీయ మీడియా సంస్థలు కూడా కథనాలు ప్రసారం చేశాయి. ఇదే అంశంపై తాజాగా బీసీసీఐ స్పందించింది. కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. గంభీర్‌పై వేటు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. టెస్ట్ జట్టు విధుల నుంచి గంభీర్‌ను తప్పించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై వస్తున్న పుకార్లను కొట్టిపారేశారు. గంభీర్ టెస్ట్ జట్టు కోచ్‌గా కొనసాగడానికి మద్దతు ప్రకటించారు. సైకియా చేసిన ఈ ప్రకటనతో గంభీర్ టెస్ట్ హెడ్‌కోచ్‌మెన్‌షిప్‌పై ఊహాగానాలు తొలగిపోయాయి.

ముందుంది ముసళ్ల పండగ

ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో (2005-27) గంభీర్ మార్గదర్శకత్వంలో భారత టెస్ట్ జట్టు పరిస్థితి దయనీయంగా ఉంది. గంభీర్ రాకకు ముందు వరుసగా రెండు డబ్ల్యూటీసీ సైకిల్స్‌లో ఫైనల్స్‌కు చేరిన టీమిండియా.. గత ఎడిషన్‌లో ఫైనల్స్‌కు చేరుకుండానే ఇంటిదారి పట్టింది. తాజా సైకిల్‌లో కూడా పరిస్థితి అలాగే కొనసాగుతుంది. ఈ సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు ఆడిన 9 టెస్ట్ మ్యాచ్‌ల్లో కేవలం 4 విజయాలు మాత్రమే సాధించి, పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో ఉంది. ఈ సైకిల్‌లో టీమిండియా ఫైనల్‌కు చేరాలంటే ఇంకా ఆడాల్సిన 9 టెస్టుల్లో కనీసం 6 విజయాలు సాధించాలి. అయితే ఇలా జరగడం అంత ఈజీగా కనిపించడం లేదు. భారత్ తదుపరి ఐదు ఆస్ట్రేలియాతో, రెండు న్యూజిలాండ్‌తో ఆడాల్సిన ఉంది. మిగిలిన రెండు శ్రీలంకతో ఆడాల్సి ఉంది. శ్రీలంకపై టీమిండియా పైచేయి సాధించినా.. ఆసీస్, కివీస్‌పై గెలవడం మాత్రం అంత ఈజీగా కాదు.



# అఖిల్ 'లెనిన్'పై కీలక అప్‌డేట్.. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్?

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'లెనిన్' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వినరో భాగ్యం విష్ణుకథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌తోనే అఖిల్ ఈ సినిమాలో విభిన్నమైన మాస్ పాత్రలో కనిపించబోతున్నాడని క్లారిటీ ఇచ్చారు మేకర్స్. అయితే ఆ తర్వాత సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ రాకపోవడంతో షూటింగ్ స్టేటస్, రిలీజ్ టైమ్‌లైన్‌పై అభిమానుల్లో సందేహాలు నెలకొన్నాయి. సోషల్ మీడియాలోనూ ఏదొక అప్‌డేట్ ఇవ్వాలని అక్కినేని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాత నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. అడగకుండానే మాట్లాడిన ఆయన, మరికొద్ది రోజుల్లోనే 'లెనిన్' ఫస్ట్ సింగిల్ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు. అంతేకాదు, సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వస్తోందని, వచ్చే ఏడాది మార్చిలో మూవీని విడుదల చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.నాగవంశీ వ్యాఖ్యలతో అక్కినేని అభిమానుల్లో జోష్ పెరిగిపోయింది. నిర్మాత మాటల్ని బట్టి చూస్తే అఖిల్ కెరీర్‌లో ఇదే ఫస్ట్ బ్లాక్‌బస్టర్ అవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని అంచనాలు వినిపిస్తున్నాయి. మరి ఈ రెండు మూడు రోజుల్లో 'లెనిన్'కు సంబంధించిన అధికారిక ప్రకటన వస్తుందా? అఖిల్ నుంచి మాస్ సర్ప్రైజ్ ఎప్పుడు వస్తుందో చూడాలి. కాగా, అఖిల్ కెరియర్‌లో ఇప్పటి వరకు మంచి హిట్ ఒక్కటి లేదు. పెళ్లి తర్వాత అఖిల్ నుండి వస్తున్న తొలి చిత్రం ఇదే కాగా, ఈ మూవీతో మనోడు మంచి హిట్ దక్కించుకుంటాడా, అక్కినేని ఫ్యాన్స్‌కి న్యూ ఇయర్‌లో మంచి ట్రీట్ ఇస్తాడా అనేది చూడాలి.

# అద్భుతమైన కంటెంట్‌తో 'ఓ అందాల రాక్షసి' స్టోరీ




దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా తెరకెక్కించిన ఈ మూవీ జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. షెరాజ్ మెహదీ మాట్లాడుతూ .. "ఓ అందాల రాక్షసి' మూవీని జనవరి 2న భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాను. కొత్త ఏడాదిలో ఓ మంచి సినిమా వస్తుంది. ఈ మూవీలో కృతి వర్మ, విహాన్షి హెగ్డే, నేహా దేశ్ పాండే, అఖిల, గీతా రెడ్డి, స్నేహా, ప్రియా దేశ్ పాల్, సుమన్ గారు, తమ్మారెడ్డి భరద్వాజ్ ఇలా చాలా మంది అద్భుతమైన పాత్రల్ని పోషించారు. మంచి కంటెంట్‌తో రాబోతోన్న ఈ సినిమా ఆడియెన్స్‌కి ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టదు. సందేశాత్మక కథతో ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇందులోని ట్విస్ట్‌లు అద్భుతంగా ఉంటాయి. అమ్మాయిలకు నచ్చే చిత్రం అవుతుంది' అని అన్నారు. కథ, మాటల రచయిత భాష్య శ్రీ మాట్లాడుతూ .. "ఓ అందాల రాక్షసి' సినిమాకు కథను, మాటల్ని రాశాను. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఓ మంచి ఫీల్‌తో బయటకు వస్తారు. నేటి తరం ఆడపిల్లలు ఎలా ఉండాలనే కాన్సెప్ట్‌తో ఈ మూవీని చేశాం. మా హీరో షెరాజ్ అద్భుతంగా నటించారు. డైరెక్టర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా, హీరోగా ఇందులో మ్యాజిక్ చేశారు. కృతి వర్మ హిందీలో చాలా ఫేమస్. విహాన్షి చాలా అద్భుతంగా నటించారు. ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది. జనవరి 2న ఈ మూవీని అందరూ చూడండి' అని అన్నారు.



# యశ్ టాక్సిక్‌లో మరో హాట్ బ్యూటీ.. ఎలిజబెత్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్


'రాకింగ్ స్టార్' యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో చాలా మంది ఆర్టిస్టులు నటిస్తున్నారు. సినిమా విడుదలకు ఇంకా చాలా రోజులు మిగిలి ఉంది. అయితే ప్రమోషన్లు మాత్రం విస్తృతంగా చేస్తున్నారు. ఈ సినిమాలోని నటీనటుల పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తున్నారు. యష్ తో పాటు , ఈ సినిమాలో చాలా మంది ప్రముఖ ఆర్టిస్టులు నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి తదితర స్టార్స్ ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులో భాగం కానున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి హుమా ఖురేషి పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. 'టాక్సిక్' సినిమాలో ఎలిజబెత్ పాత్రలో హుమా ఖురేషి నటిస్తోంది. పేరుకు తగ్గట్టుగానే ఈ పాత్ర చాలా రిచ్ గా ఉంది. గ్లామరస్ డ్రెస్ వేసుకుని రెట్రో లగ్జరీ కారు ముందు నిలబడి ఉన్న హుమా ఖురేషి లుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది చూసిన తర్వాత ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

'టాక్సిక్' సినిమాను కన్నడ, ఇంగ్లీషు భాషల్లో ఒకేసారి నిర్మిస్తున్నారు. దీనిని ఇతర భాషల్లోకి డబ్ చేస్తున్నారు. 'కె.వి.ఎన్. ప్రొడక్షన్స్' ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. యష్, నయనతార, కియారా అద్వానీ, అక్షయ్ ఒబెరాయ్, తారా సుతారియా, టోవినో థామస్, రుక్మిణి వసంత్ తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం నటి కియారా అద్వానీ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ సినిమాలో ఆమె నదియా పాత్రను పోషిస్తోంది. గీతు మోహన్‌దాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'కేజీఎఫ్: చాప్టర్ 2' తర్వాత యష్ అంగీకరించిన సినిమా ఇది కాబట్టి, 'టాక్సిక్' పై చాలా అంచనాలు ఉన్నాయి.




# మన శంకర వరప్రసాద్ గారు నుండి స్పెషల్ పోస్టర్..


సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి స్పీడ్ మరింత పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్లను దూకుడు పెంచింది. తాజాగా మూవీ రిలీజ్‌కి కేవలం 15 రోజుల సమయం మాత్రమే ఉందని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. ఇందులో చిరు కొబ్బరి బోండం తాగుతూ స్టైలిష్ లుక్‌లో కనిపించారు. ఈ పోస్టర్ మెగా ఫ్యాన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. చిరు ఫ్యాన్స్ ఈ పోస్టర్‌ని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే అమెరికాలో ఈ సినిమా బుకింగ్స్ అధికారికంగా ఓపెన్ చేసినట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించిన యూఎస్ ప్రీమియర్స్ జనవరి 11న అత్యంత గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. సంక్రాంతి పండుగకు ముందే బాక్సాఫీస్ బజ్ స్టార్ట్ కావాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ ప్లాన్ చేశారు. పండగ మూడ్‌ను సెట్ చేసేలా ప్రీమియర్స్‌ను డిజైన్ చేయడంతో ఓవర్సీస్‌లో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ సరిగామ సినిమాస్ ఈ చిత్రాన్ని విదేశాల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేస్తోంది. . అనిల్ రావిపూడి మార్క్ కామెడీకి చిరంజీవి మాస్ ఇమేజ్, కామెడీ టైమింగ్ కలిస్తే వచ్చే ఎంటర్‌టైన్‌మెంట్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ భారీ అంచనాలు ఉన్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి నుంచి వస్తున్న పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ కావడంతో ఈ సినిమాపై బజ్ మామూలుగా లేదు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం ఇప్పటికే మాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఇప్పుడు ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ కావడంతో రికార్డుల వేట మొదలైనట్లే అని అభిమానులు భావిస్తున్నారు. జనవరి 11న ప్రీమియర్స్‌తోనే సినిమా రేంజ్ ఏంటో తేలిపోతుందని ట్రేడ్ విశ్లేషకులు అంటున్నారు.




# డీసెంట్ టాక్‌తో దూసుకెళ్తున్న 'ఛాంపియన్' 10 కోట్ల దిశగా స్పోర్ట్స్ డ్రామా

యంగ్ హీరో రోషన్ మేక హీరోగా నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్' బాక్సాఫీస్ వద్ద నిలకడగా పరుగులు పెడుతోంది. విడుదలైన మొదటి రోజు మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ తర్వాత వర్డ్ ఆఫ్ మౌత్‌తో కలెక్షన్లు మెరుగుపడ్డాయి. మూడు రోజుల్లోనూ డీసెంట్ వసూళ్లు సాధిస్తూ సినిమాపై మంచి బజ్ కొనసాగుతోంది. మూవీ టీం వెల్లడించిన వివరాల ప్రకారం, 'ఛాంపియన్' చిత్రం మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.8.89 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ సందర్భంగా "ఛాంపియన్ థియేటర్లలో అదే జోష్ కొనసాగిస్తోంది" అంటూ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ డే ప్రపంచవ్యాప్తంగా రూ.4.50 కోట్లు, రెండో రోజు రూ.2.40 కోట్లు రాబట్టిన సినిమా, మూడో రోజు కూడా అదే స్థాయిలో కలెక్షన్లు నమోదు చేసింది. వీకెండ్ ముగిసేలోగా లేదా సోమవారం నాటికి రూ.10 కోట్ల మార్క్ దాటే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రంలో రోషన్ సరసన అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించగా, వీరిద్దరికీ ఇదే తొలి సినిమా కావడం విశేషం. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో, ఒకప్పటి హీరో నందమూరి కల్యాణ్ చక్రవర్తి 'రాజి రెడ్డి' పాత్రలో ఆకట్టుకున్నారు. అలాగే అర్చన, కోవై సరళ, వెన్నెల కిశోర్, నరేష్, ప్రకాష్ రాజ్, రచ్చ రవి, హైపర్ ఆది, సంతోష్ ప్రతాప్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించారు. జీ స్టూడియోస్ సమర్పణలో, స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిం బ్యానర్లపై ఈ సినిమాను నిర్మించారు. నిర్మాతగా స్వప్న దత్ వ్యవహరించారు. సంగీతం మిక్కీ జే మేయర్ అందించగా, ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు మంచి స్పందన వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో ప్రజలు భయంతో బతుకుతున్న కాలం నేపథ్యంలో కథ నడుస్తుంది.

# నా కులం చూసి హీరోగా తీసేశారు : రవికృష్ణ



సీరియల్ నుంచి సినిమాల్లోకి వచ్చిన నటుడు రవికృష్ణ. మొగలిరేకులు సీరియల్‌తో బుల్లితెరకు పరిచమైన రవికి బిగ్‌బాస్ షోతో మరింత గుర్తింపు వచ్చింది. షో నుంచి బయటకు వచ్చిన తర్వాత సినిమా చాన్స్‌లు వచ్చాయి. విరూపాక్ష సినిమా రవి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఆ తర్వాత రవి వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు. ఇటీవల విడుదలైన దండోరాలో కీలక పాత్ర పోషించాడు. కులం నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రవి..తక్కువ కులానికి చెందిన యువకుడిగా నటించాడు. అగ్ర కులానికి చెందిన అమ్మాయితో ప్రేమలో పడి.. ఆమె కులం వాళ్ల చేతిలో హత్యకు గురవుతాడు. సినిమా ప్రేక్షకులు రవి నటనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఇలాంటి పాత్రల్లో నటించే అవకాశం కోసం చాలా కష్టపడాల్సి వచ్చిందంటున్నారు రవి. దండోరా సినిమాలో మాదిరే తాను కూడా కుల వివక్షకు గురయ్యాడట. తన కులం చూసి సినిమా చాన్స్‌లు ఇవ్వలేదట. తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో? రవి తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఇబ్బందుల గురించి వివరించాడు. 'మాది విజయవాడ. మిడిల్ క్లాస్ ఫ్యామిలీ నుంచి వచ్చాను. నా కంటే ముందు మా ఫ్యామిలీ నుంచి ఒక్కరు కూడా ఇండస్ట్రీలోకి రాలేదు. నాకు సినిమాలంటే పిచ్చి. కానీ ఇండస్ట్రీ ఎక్కడ ఉంటుందో కూడా తెలియదు. ఇంటర్ పూర్తయ్యాక సినిమాల్లోకి వెళతా అంటే..ఇంట్లో తిట్టారు. దీంతో డిగ్రీ చేసి.. సినిమాల్లోకి వచ్చాడు. సినిమా ఇండస్ట్రీ హైదరాబాద్‌లో ఉంటుందని తెలియక..చెన్నై వెళ్లాను. అక్కడ ఓ సీరియల్‌కి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశా. కొన్నాళ్ల తర్వాత వాళ్లే ఓ తెలుగు సీరియల్ చేస్తే..అందులో నటించాడు. అది మూడు నెలలకే ఆగిపోయింది. ఆ తర్వాత తెలుగు ఇండస్ట్రీ హైదరాబాద్‌లో ఉంటుందని తెలుసుకొని.. ఇక్కడకు వచ్చాడు. మా మేనత్త వాళ్ల ఇంట్లో ఉంటూ.. అవకాశాల కోసం తిరిగాను.

# ఫేస్‌బుక్, వాట్సాప్‌లో కొత్తతరం ఏఐ ఏజెంట్స్

టెక్నాలజీ రంగంలో మరో భారీ ఒప్పందం కుదిరింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ 'మానస్'ను కొనుగోలు చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ డీల్ విలువ 2 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 16,600 కోట్లు) పైగానే ఉంటుందని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ కొనుగోలుతో ఏఐ రంగంలో గూగుల్, ఓపెన్‌ఏఐ వంటి సంస్థలకు గట్టి పోటీ ఇవ్వాలని మెటా లక్ష్యంగా పెట్టుకుంది. చైనాకు చెందిన వ్యవస్థాపకులు ప్రారంభించిన మానస్, ప్రస్తుతం సింగపూర్ కేంద్రంగా పనిచేస్తోంది. ఇది సాధారణ ఏఐ చాట్‌బాట్‌ల లాంటిది కాదు. వినియోగదారుల సూచనలకు స్పందించడమే కాకుండా, తనంతట తానుగా క్లిష్టమైన పనులను పూర్తిచేసే "జనరల్ పర్పస్ అటానమస్ ఏఐ ఏజెంట్ల"ను అభివృద్ధి చేయడంలో ప్రసిద్ధి చెందింది. మార్కెట్ రీసెర్చ్, డేటా విశ్లేషణ, కోడింగ్, ట్రిప్ ప్లానింగ్ వంటి పనులను ఇది మానవ ప్రమేయం లేకుండానే చేయగలదు. ఈ అత్యాధునిక టెక్నాలజీని తమ ఉత్పత్తుల్లో విలీనం



చేయడమే లక్ష్యంగా ఈ కొనుగోలు జరిపినట్లు మెటా ఒక ప్రకటనలో తెలిపింది. "ఏఐ ఏజెంట్లు తదుపరి అతిపెద్ద టెక్నాలజీ మార్పును సూచిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ కేవలం సూచనలకు స్పందించడమే కాకుండా, వినియోగదారుల తరపున పనులు కూడా చేస్తుంది. ఈ దిశగా మా దీర్ఘకాలిక వ్యూహానికి మానస్ బృందం పనితీరు సరిగ్గా సరిపోతుంది" అని మెటా వివరించింది. భవిష్యత్తులో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలోని 'మెటా ఏఐ' అసిస్టెంట్‌లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తేనున్నారు. ఈ ఒప్పందంపై మానస్ సీఈఓ షావో హాంగ్ కూడా స్పందించారు. "మెటాతో కలవడం మా పనికి దక్కిన గొప్ప గుర్తింపు. మానస్ పనితీరులో ఎలాంటి మార్పు లేకుండా, మరింత బలమైన పునాదిపై భవిష్యత్తును నిర్మించుకుంటాం" అని ఆయన తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. ఈ డీల్ ప్రకారం, షావో హాంగ్ మెటాలో వైస్ ప్రెసిడెంట్‌గా చేరనున్నారు. 2022లో ప్రారంభమైన మానస్, కేవలం 8 నెలల్లోనే 100 మిలియన్ డాలర్ల వార్షిక ఆదాయాన్ని సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. కొనుగోలు తర్వాత కూడా మానస్ సేవలను ప్రత్యేకంగా కొనసాగిస్తామని, అదే సమయంలో తమ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఈ టెక్నాలజీని విలీనం చేస్తామని మెటా స్పష్టం చేసింది. వాట్సాప్ కొనుగోలు తర్వాత మెటా చరిత్రలో ఇది మూడో అతిపెద్ద డీల్‌గా నిలవడం గమనార్హం.

# ఆ ప్రాంతాల్లో గాలిపటం ఎగరేయొద్దు!

సంక్రాంతి పండుగ సీజన్ సంధర్భంగా ప్రజలకు దక్షిణమధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. రైల్వే విద్యుత్ తీగలపై చిక్కి వేలాడుతున్న గాలిపటం దారాలను ఎట్టిపరిస్థితుల్లో తాకకూడదని ప్రజలను హెచ్చరించింది. రైల్వే ప్రాంగణాల పరిసరాల్లో, యార్డులు, ట్రాక్‌లు మరియు సమీపంలోని జనసంచార ప్రాంతాలలో గాలిపటాలు ఎగురవేయడం వల్ల విద్యుదాఘాతానికి గురైన సంఘటనలు ఇదివరకూ అనేకం జరిగాయని తెలిపింది. పతంగీలు ఎగరవేయడంపై జాగ్రత్తలను సూచిస్తూ ప్రకటన విడుదల చేసింది. గత సంక్రాంతి పండుగ సీజన్‌లో విద్యుధాఘాత ఘటనలు రైల్వేలోని అనేక జోన్‌లలో నమోదయ్యాయని తెలిపింది. కొంతమంది వ్యక్తులు 25 కె.వి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ కండక్టర్‌లలో చిక్కుకున్న గాలిపటం దారాలను ముట్టుకోవడం ద్వారా విద్యుత్ షాక్‌లు తగిలి తీవ్ర గాయాల పాలయ్యారని పేర్కొంది. ప్రస్తుతం గాలి పటాలు ఎగరవేయడంలో ప్రజలంతా ప్రధానంగా చైనా మాంజా వాడుతున్నారని అది చాలా ప్రమాదకరమని తెలిపింది. ఆదారాలు విద్యుత్ వాహకం ( విద్యుత్‌ను సులభంగా గ్రహించేవి) అవడం వలన మానవ ప్రాణాలకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని రైల్వేశాఖ తెలిపింది. అంతే కాకుండా రైల్వే విద్యుత్ మౌలిక సదుపాయాలకు తీవ్ర ముప్పును కలిగిస్తాయని పేర్కొంది. దీనివలన ప్రయాణీకులతో పాటు రైల్వే సిబ్బందికి, సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఇతర ప్రమాదాలకు దారి తీసే అవకాశాలున్నాయని తెలిపింది. కనుక ఈ



విషయంలో ప్రజలు రైల్వేశాఖకు పూర్తి సహకారం అందించాలని రైల్వే ట్రాక్‌లు, స్టేషన్లు, యార్డులు మరియు ఇతర రైల్వే సంస్థాపనల దగ్గర గాలిపటాలు ఎగురవేయకూడదని రైల్వేశాఖ ప్రకటన విడుదల చేసింది. ప్రతి ఒక్కరూ పండుగలను సంతోషంగా బాధ్యతాయుతంగా జరుపుకోవాలని రైలు కార్యకలాపాలను సజావుగా కొనసాగించడంలో సహాయపడాలని కోరింది.

# తమిళనాడు ప్రభుత్వానికి షాక్

తమిళనాడు ప్రభుత్వానికి బిగ్ షాక్ తగిలింది. స్టాలిన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన మద్రాస్ యూనివర్సిటీ సవరణ బిల్లును రాష్ట్రపతి భవన్ మంగళవారం వెనక్కి పంపించేసింది. మూడేళ్లుగా రాష్ట్రపతి వద్ద ఈ బిల్లు పెండింగ్‌లోనే ఉన్న సంగతి తెలిసిందే. మద్రాస్ యూనివర్సిటీ చట్టం 1923 ప్రకారం.. తమిళనాడు గవర్నర్ యూనివర్సిటీకి ఎక్స్-ఆఫీషియో చాన్సలర్. వైస్ చాన్సలర్ నియామకం, తొలగింపు తదితర హక్కులు గవర్నర్ వద్దే ఉన్నాయి. అయితే.. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవితో స్టాలిన్ సర్కార్‌కు పొసగడం లేదు. గవర్నర్ వల్లే తమిళనాడులో వర్సిటీల వీసీ నియామకాలు నిలిచిపోయాయని ప్రభుత్వం తరచూ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో మద్రాస్ వర్సిటీ బిల్లు ద్వారా గవర్నర్ అధికారాలకు చెక్ పెట్టాలని స్టాలిన్ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వైస్ చాన్సలర్‌ను నియమించుకునే అధికారం పొందడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలకు అనుగుణంగా యూనివర్సిటీ పాలనను మార్చడం, అలాగే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని యూనివర్సిటీ సిండికేట్‌లో సభ్యుడిగా చేర్చడం తదితర అంశాలను బిల్లులో తమిళనాడు ప్రభుత్వం





పొందుపరిచింది. అయితే ఈ బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపగా.. మూడేళ్ల తర్వాత ఇప్పుడు రాష్ట్రపతి ముర్ము ఈ బిల్లును ఆమోదించకుండానే తిరిగి పంపించారు.

## ఇండోపాక్ సమరాన్ని ఆపా :
## నెతన్యాహూతో పేర్కొన్న ట్రంప్

**న్యూయార్క్:** ఇండోపాక్ వార్‌ను ఆపినట్లు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూతో జరిగిన మీటింగ్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు.



ఫ్లోరిడాలోని మార్ ఏ లాగో పామ్‌బీచ్‌లో ట్రంప్‌తో నెతన్యూ భేటీ అయ్యారు. రెండోసారి వైట్‌హౌజ్‌లోకి ప్రవేశించిన తర్వాత ఇప్పటి వరకు 8 యుద్ధాలను నివారించినట్లు ట్రంప్ తెలిపారు. ఆర్మేనియా, అజర్‌బైజాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని, టారిఫ్‌లతో ఆ రెండు దేశాలను బెదిరించినట్లు చెప్పారు. కానీ తనకు అనుకున్నంత క్రెడిట్ దక్కలేదన్నారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య ఫైటింగ్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ వెల్లడించారు. అజర్‌బైజాన్ యుద్ధాన్ని ఆపిన తీరు పట్ల పుతిన్ కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు ట్రంప్ చెప్పారు. వాణిజ్యాన్ని నిలిపివేస్తానని అజర్‌బైజాన్‌ను బెదిరించామని, 200 శాతం టారిఫ్ విధిస్తామని చెప్పామన్నారు. దీంతో 35 ఏళ్ల ఫైటింగ్‌కు ఆ దేశం ఫుల్‌స్టాప్ పెట్టిందన్నారు. ఆ పని చేసినందుకు నాకేమీ క్రెడిట్ దక్కలేదని, అలాగే 8 యుద్ధాలను ఆపానన్నారు. ఇండియా, పాక్ వార్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ చెప్పారు. ఇండోపాక్ సంక్షోభ అంశంపై ఇప్పటి వరకు సుమారు 70 సార్లు ట్రంప్ స్పందించినట్లు తెలుస్తోంది.

# మంచంపై పులిరాజా.. ఓ చేదు నిజం!

గ్రామంలోకి చొరబడిన ఓ పెద్దపులి.. జనాలను బెంబేలెత్తించింది. ఓ వ్యక్తిపై దాడి చేశాక.. ఆరుబయట ఉన్న మంచంపై తీరికగా సేద తీరింది. ఆ దృశ్యాన్ని కొందరు ఫోన్లలో బంధించడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే ఈ ఘటన వెనుక ఉన్న? చేదు నిజం గురించి చర్చ మాత్రం జరగడం లేదన్న అభిప్రాయం సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మధ్యప్రదేశ్ బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో గ్రామంలోకి చొరబడింది. అక్కడ ఆరుబయట సంచరిస్తుండగా దానిపై రాళ్లతో దాడి చేశారు. భయంభయంగానే అది దాక్కునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో అది అక్కడే కట్టేసిన ఉన్న పశువుల జోలికి పోలేదు (గ్రామస్తులు కూడా ఇదే విషయాన్ని చెప్పారు). అయితే రాళ్లు తగిలిన కోపంతో.. ఓ గ్రామస్తుడ్ని నేలకేసి కొట్టింది. ఆపై మరో ఇంట్లోకి వెళ్లి కొన్ని గంటలపాటు మంచంపై కూర్చుని సేదదీరింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది సుమారు 8 గంటలపాటు శ్రమించి పులిని బంధించారు. పులి బోనులోకి చేరడంతో పాటు గాయపడిన వ్యక్తికి కూడా ప్రాణాపాయం తప్పడంతో.. ఆ ఊరి ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. వేటగాళ్లకు భయపడే పులులు గ్రామాల్లోకి వస్తున్నాయని ఆ ఊరి ప్రజలు చెబుతుండడం ఇక్కడ చర్చించాల్సిన విషయం. టైగర్ స్టేట్‌గా పేరొందిన మధ్యప్రదేశ్‌లో పెద్దపులుల మరణాల లెక్కలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. తాజాగా.. సగర్ జిల్లాలోని ధానా ఫారెస్ట్ రేంజ్‌లో 10 ఏళ్ల ఆడ పులి మృతదేహం దొరికింది. గత వారం రోజుల్లో రాష్ట్రంలో ఆరు పులులు మృత్యువాత పడగా.. ఈ ఒక్క ఏడాదిలోనే 55 పులులు మరణించడం గమనార్హం. 1973లో మధ్యప్రదేశ్‌లో పులుల సంరక్షణ కోసం ప్రాజెక్ట్ టైగర్ ప్రారంభమైంది. అప్పటి నుంచి పులులు అత్యధికంగా చనిపోయింది ఈ ఏడాదిలోనే. అందునా అసహజ మరణాలే 11 నమోదు అయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. అయితే.. అటవీ శాఖ వీటిని ఎక్కువగా పులుల మధ్య గొడవలుగా పేర్కొంటున్నాయి. కానీ, క్షేత్ర పరిస్థితులు అవి కావనే చెబుతున్నాయి. వేట, కరెంట్ ఉచ్చులు.. పర్యవేక్షణ లోపాలు, నిర్లక్ష్యం ప్రధాన కారణాలని తెలుస్తోంది. ఓ జాతీయ మీడియా సంస్థ బయటపెట్టిన అటవీ శాఖ నివేదికలో.. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, సరైన ఫోరెన్సిక్ పరిశీలన లేకపోవడం బయటపడ్డాయి. ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఉన్న వన్యప్రాణి అక్రమ రవాణా నెట్వర్క్ ప్రధాన సూత్రధారి యాంగ్‌చెన్ లఖుంపా ఇటీవలె సిక్కిం బార్డర్‌లో అరెస్టు అయ్యాడు. మధ్యప్రదేశ్‌లో పులులను చంపి.. వాటి చర్మం, గోళ్లు పళ్లు.. అక్రమ రవాణా చేసిన అభియోగాలు అతనిపై ఉన్నాయి. సంరక్షణవాదులు వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయని, సంస్కరణలు లేకపోతే మరణాలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్నారు.

## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్



భారతీయ పరిశోధకుల నేతృత్వంలో జరిగిన ఓ తాజా అధ్యయనం ఆరోగ్య రంగంలో ఆందోళనకర విషయాలను వెల్లడించింది. డ్రగ్ రెసిస్టెంట్ (మందులకు లొంగని) ఫంగల్ జాతి 'కాండిడా ఆరిస్' ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని, ఇది గతంలో కంటే ప్రాణాంతకంగా మారుతోందని హెచ్చరించింది. ఢిల్లీలోని వల్లభ్‌భాయ్ పటేల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్, అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ ప్రమాదకరమైన ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 65 లక్షల మందిపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. దీని తీవ్రత ఎంతలా ఉందంటే.. యాంటీ ఫంగల్ చికిత్స అందించినప్పటికీ మరణాల రేటు 50 శాతానికి పైగా ఉంటోందని పేర్కొన్నారు. ఇది బహుళ ఔషధాలను తట్టుకునే శక్తిని కలిగి ఉండటం వైద్యులను కలవరపెడుతోంది. కాండిడా ఆరిస్ మానవ చర్మంపై ఎక్కువ కాలం జీవించి ఉండగలదని, అక్కడి నుంచి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుందని నిపుణులు వివరించారు. ఇది ఈస్ట్ నుంచి ఫిలమెంట్‌గా రూపం మార్చుకోవడం, కణాల సమూహాలను ఏర్పరచుకోవడం వంటి కణ స్థాయి వ్యూహాలతో మనుగడ సాగిస్తోందని 'మైక్రోబయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక పేర్కొంది. చర్మంపై, అలాగే నిర్జీవ ప్రదేశాలపై కూడా ఇది గమ్ లాగా అతుక్కుపోతుందని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి ఇతరులకు ఈ ఫంగస్ సులభంగా వ్యాపించే ముప్పు ఉందని హెచ్చరించారు. మరోవైపు, సాధారణ ల్యాబ్ పరీక్షల్లో ఈ ఫంగస్‌ను గుర్తించడం కష్టమని, తరచుగా దీనిని వేరే ఈస్ట్‌గా పొరబడే అవకాశం ఉందని, దీనివల్ల చికిత్స ఆలస్యమవుతోందని పరిశోధకులు వివరించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కొత్త రకం యాంటీ ఫంగల్ మందులు, మెరుగైన వ్యాక్సిన్లు, అధునాతన డయాగ్నస్టిక్ పరీక్షలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచించారు.

## మహిళలకు రక్షణ లేకుండా పోయింది'




పశ్చిమ బెంగాల్‌లోని మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ప్రభుత్వం అవినీతి, భయం, చొరబాట్లతో బెంగాల్ నిండిపోయిందని.. ఇది రాష్ట్ర భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తోందని ఆరోపించారు. కోల్‌కతాలో విలేకరుల సమావేశంలో షా మాట్లాడుతూ.. 15 ఏండ్ల తృణమూల్ పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. 'గత 15 ఏండ్లుగా బెంగాల్ భయం, అవినీతి, దుష్పరిపాలనను చూసింది. చొరబాట్లు ప్రజల్లో అభద్రతా భావాన్ని, ఆందోళనను సృష్టించాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది' అని షా వ్యాఖ్యానించారు. దీదీ నేతృత్వంలోని ప్రభుత్వ అవినీతి కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బెంగాల్‌కు తిరిగి పూర్వవైభవం తెస్తామని.. స్వామి వివేకానంద, బంకిం చంద్ర చటోపాధ్యాయ, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఊహించిన బెంగాల్‌ను నిర్మించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పుతిన్ ఇంటిపైదాడి... మోడీ ఆందోళన

**న్యూఢిల్లీ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు.రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

## ప్రియాంక గాంధీ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు..
## స్నేహితురాలితో కుమారుడి ఎంగేజ్మెంట్

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ప్రియాంక, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. తన స్నేహితురాలు అవీవా బేగ్ తో రేహాన్ ఎంగేజ్మెంట్



జరిగినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. 25 ఏళ్ల రైహాన్ వాద్రాకు అవీవాతో ఏడేళ్లుగా పరిచయం ఉంది. వీరిద్దరూ మంచి స్నేహితులు. ఆ స్నేహం కాస్తా ప్రేమకు దారి తీసింది. ఈ క్రమంలో అవివా బేగ్‌కు రేహాన్ ప్రపోజ్ చేయగా.. ఆమె ఓకే చెప్పినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో వీరిద్దరూ త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137